


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 సంచిక : 222 అమలాపురం ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ మంగళవారం, 22 ఏప్రిల్, 2025 పేజీలు : 12 వెల : 2/-



## ఏఐసీసీకి నో పవర్స్

### ఇక అధికారాలన్నీ ఎవరివో తెలుసా!

**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :**
కాంగ్రెస్ లో ఏఐసీసీ నిర్ణయాలే సుప్రీం. ఏఐసీసీ పెద్దలు సూచనలు, సలహాలనే క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సివుంటుంది. జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎంత పెద్ద స్థాయి నేతలు ఉన్నా, వారు ఏఐసీసీ పెద్దలకు జీ హుజార్ అనాల్సిందే.. అయితే ఈ విధానంపై చాలా కాలం తర్వాత హస్తం హైకమాండ్ అంతర్మథనం చేసుకుంది. పైన చెప్పడం.. క్షేత్రస్థాయిలో ఆచరించడం వల్ల పార్టీకి ఎక్కువగా నష్టమే జరిగిందని ఫీడ్ బ్యాక్ రావడంతో ఇప్పటి వరకు అమలు చేస్తున్న విధానాన్ని సమూలంగా మార్చేయాలని అగ్రనేత రాహుల్ గాంధీ సూచించినట్లు సమాచారం. కాంగ్రెస్ లో సమూల మార్పుల దిశగా ఆ పార్టీ హైకమాండ్ చర్యలు తీసుకుంటోంది. పార్టీని ప్రక్షాళించి వచ్చే సార్వత్రిక

మిగతా 2

## థాక్రే బ్రదర్స్ దమ్ములు చూపిస్తారా ?



**ముంబై :** ఆ ఇద్దరూ అన్నదమ్ములు. అంటే కజిన్స్ అన్న మాట. మహా రాజకీయాల్లో పెద్ద పులి లాంటి శివసేన అధినేత బాల్ థాక్రేకి మొదట వారసుడిగా ఆయన తమ్ముడి కొడుకు రాజ్ థాక్రే అని అంతా అనుకునేవారు. బాల్ థాక్రేని అచ్చుగుద్దినట్లుగా ఆయన అన్ని విషయాల్లో పోలి ఉండేవారు. థాక్రే డేరింగ్ అండ్ డాషింగ్ పొలిటికల్ స్టైల్ రాజ్ థాక్రేకు వచ్చింది. అలాగే ఆయన ఆవేశపూరితమైన స్పీచులు అలాగే బాడీ లాంగ్వేజ్ ఆయన వేసే సెటైర్లు మరాఠీ భాష మీద పట్టు ఇవన్నీ రాజ్ కే ఎక్కువగా అబ్బాయి. అంతే కాదు థాక్రే మార్క్ వ్యూహాలు కూడా రాజ్ కే ఎక్కువగా పట్టుబడ్డాయి. ఇక 1990

మిగతా 2

## పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

### వాటికన్ ప్రకటన..!



**లాటిన్ :** లాటిన్ అమెరికాకు చెందిన తొలి పోప్ ఫ్రాన్సిస్ ఇవాళ కన్నుమూశారు. 88 ఏళ్ల పోప్ ఇవాళ చనిపోయినట్లు వాటికన్ ఓ ప్రకటనలో తెలిపింది. ఆయన మృతితో ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఇటలీ కాలమానం ఈ ఉదయం 7.35 నిమిషాలకు ఆయన తిరిగి దేవుడి వద్దకు చేరుకున్నట్లు వాటికన్ టెలిగ్రామ్ ఛానల్లో విడుదల చేసిన ఓ వీడియో ప్రకటనలో వెల్లడించింది.ల తాజాగా ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న పోప్ ఫ్రాన్సిస్. ఆదివారం



# మెగా డీఎస్సీ బీ రెడీ

- 16,347 పోస్టులకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- 7,487 స్కూల్ అసిస్టెంట్.. 6,599 ఎస్జీటీ పోస్టులు
- అత్యధికంగా కర్నూలు జిల్లాలో 2,645 ఖాళీలు
- 3 ప్రధాన మార్పులతో 2 వేర్వేరు నోటిఫికేషన్లు
- మే 15 వరకు దరఖాస్తులకు గడువు
- జూన్ 6 నుంచి జూలై 6 వరకు పరీక్షలు
- పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహణ
- ప్రాధాన్యం ముందే ఎంపిక చేసుకోవాలి
- అభ్యర్థులు సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి
- నేరుగా తుది ఫలితాల జాబితా ప్రకటన
- పోస్టులు మిగిలితే తర్వాతి నోటిఫికేషన్‌లో భర్తీ
- ఎస్సీ వర్గీకరణ అమలు కానున్న తొలి నోటిఫికేషన్

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :**
లక్షలాది మంది ఉద్యోగార్థులు ఆశగా ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఆదివారం జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం రెండు వేర్వేరు నోటిఫికేషన్లు ప్రకటించింది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ స్కూళ్లు, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, జువెనైల్ సంక్షేమ విభాగంలో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ పోస్టులకు ఒక నోటిఫికేషన్ ఇచ్చింది. మోడల్ స్కూళ్లు, సంక్షేమ సొసైటీల్లో పోస్టులకు మరొక నోటిఫికేషన్ జారీ చేసింది. ఆదివారం నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. అభ్యర్థులు మే 15వ తేదీ వరకు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పోస్టులకు సంబంధించిన సిలబస్‌ను కూడా పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. జూన్ 6 నుంచి

మిగతా 2

## ఎంఐఎం దూకుడు!

### 48 గంటలే గడువు



**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ :**
మరో 48 గంటల్లో హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న విషయం తెలిసిందే. ఇక, ఈ రోజు సాయంత్రంతో ఎన్నికల విందులు.. చర్చలకు కూడా ఫుల్ స్టాప్ పడనుంది. ఈ నెల 23న హైదరాబాద్ లోకల్ బాడీ స్థాయిలోని ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ జరగ నుంది. దీనిలో గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు పాల్గొని ఓటు హక్కు వినియోగించుకుంటారు. అదేవిధంగా ఎక్స్ అఫిషియో సభ్యులుగా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు(హైదరాబాద్ పరిధిలోని) తమ ఓట్లను వేయనున్నారు. ఇక, ఈ ఎన్నికల్లో బీఆర్ ఎస్, కాంగ్రెస్ తప్పుకొన్న విషయం తెలిసిందే. చిత్రంగా ఈ రెండు పార్టీలు.. తెరవెనుక ఎంఐఎంకు మద్దతు ఇస్తున్నాయన్నది పెద్ద ఎత్తున జరుగుతున్న ప్రచారం. బీఆర్ ఎస్

మిగతా 2

## జపాన్‌లో రేవంత్ దూకుడు!



**జపాన్ :** గడిచిన కొద్దిరోజులుగా జపాన్‌లో పర్యటిస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీబిజీగా ఉంటున్నారు. వరుస పెట్టి దిగ్గజ కంపెనీలతో భేటీ కావటం.. ఒప్పందాలు చేసుకోవటం చేస్తున్నారు. ఒకటి తర్వాత ఒకటి చొప్పున ఆయన చేసుకుంటున్న ఒప్పందాలు అందరికి ఆకర్షించేలా ఉన్నాయి. గత ప్రభుత్వంలో రాష్ట్ర ఐటీ.. మున్సిపల్ శాఖా మంత్రిగా వ్యవహరించిన కేటీఆర్ తరచూ విదేశాలకు వెళ్లే వారు. అక్కడ బ్రాండ్ తెలంగాణను ప్రమోట్ చేసే పనిలో సక్సెస్ అయినట్లుగా ప్రచారం

మిగతా 2

## భూ అక్రమార్కుల మీద పవన్ కన్ను



**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ :**
జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి భూ అక్రమార్కుల మీద కబ్జా కోరుల మీద మూడో కన్ను తెరిచారు. ఇక వారి ఆటలు సాగవని ఆయన స్పష్టంగా చెబుతున్నారు. ఏపీలో ఎక్కువ అవుతున్న భూ కబ్జాలు దందాల మీద తాజాగా పవన్ సీరియస్ అయ్యారు. దాంతో ఆయన తొందరలో జిల్లా టూర్లు చేపడతాను అని తన దగ్గరకు వచ్చే కబ్జా ఫిర్యాదుల మీద కఠినమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఇదిలా ఉంటే ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు పై దాటింది. అయితే ఏపీలో అనేక చోట్ల

మిగతా 2

## వంశీకి ఊరట దక్కదా?



**విజయవాడ, విశ్వంవాయిస్ న్యూస్ :**
మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్ ను హైకోర్టు వాయిదా వేసింది. ఫిబ్రవరి 13న సత్యవర్ధన్ కిడ్నాపు కేసులో అరెస్టు అయిన వంశీ సుమారు 68 రోజులుగా జైలులోనే రిమాండు ఖైదీగా ఉన్నారు. తొలుత సత్యవర్ధన్ కిడ్నాపు కేసులో అరెస్టు అయిన వంశీపై వరుసగా వివిధ కేసులు నమోదు చేయడంతో ఆయన అనేక చిక్కుముళ్ల

మిగతా 2

## హెం మంత్రి ఇలాకాలో రగడ...!



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :**
రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి విశాఖ జిల్లా పాయకరావు పేట లో మళ్లీ అదే రగడ చోటు చేసుకుంది. గతంలో ఏ విధంగా అయితే.. ఇక్కడ అనితను వ్యతిరేకించే రాజకీయాలు తెరమీదికి వచ్చాయో.. ఇప్పుడు కూడా అలానే ఉన్నాయని.. టీడీపీ నాయకులు చెబుతున్నారు. నియోజకవర్గానికి దూరంగా

మిగతా 2

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

**అర్జీలు పునరావృతం అయితే అధికారులే పూర్తి బాధ్యత వహించాలి**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో 402 విజ్ఞప్తులు : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్**



**విశాఖపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక “పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్” లో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి అర్జీల పరిష్కారానికి అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమం సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి వారితో స్వయంగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని

మిగతా 2

## అవంతికి రూట్ క్లియర్ కావడం లేదా ?



**విశాఖపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** విశాఖ మేయర్ పదవి కూటమికి దక్కడంలో తులసీదళం మాదిరిగా మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ కుమార్తె ఆరవ వార్డు జీవీఎంసీ కార్పొరేటర్ లక్ష్మి ప్రియాంక ఓటు పనిచేసింది. 74 మ్యాజిక్ ఫిగర్ ని చేరుకోవడానికి కూటమికి ఆ విధంగా అవంతి కుమార్తె ఓటు ఆక్సిజన్ గా ఉంది. అయితే కూటమికి చాలా మంది వైసీపీ వారు ఓటు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు మాజీ మంత్రుల వారసులూ ఓటు చేశారు. ఇపుడు వారందరినీ తెచ్చి కూటమి పార్టీలు చేర్చుకుంటాయా అంటే అదేమీ లేదు అని కూటమి వైపు పార్టీల నాయకులు అంటున్నారు వైసీపీ ఏలుబడిలో విశాఖ అభివృద్ధి చెందలేదని భావించే వారు మద్దతు ఇచ్చారు తప్ప అందులో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యతలు లేవని అంటున్నారు. ఇక మాజీ మంత్రి వైసీపీలో అయిదేళ్ళ పాటు అధికారం అందుకున్న అవంతి శ్రీనివాసరావు గత డిసెంబర్ లో ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఇపుడు ఆయన కూటమి వైపు చూస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. అయితే ఆయనకు కూటమిలోకి ఎంట్రీ ఉంటుందా అన్నదే విశాఖలో చర్చగా ఉంది. అవంతి శ్రీనివాసరావు తన 15 ఏళ్ళ రాజకీయ జీవితంలో నాలుగు పార్టీలు మారారని అంటున్నారు. ఆయన ఏ పార్టీకి గాలి ఉంటే ఆ వైపుగా మారే పొద్దు తిరుగుడు పువ్వు లాంటి వారు అని అంటున్నారు. ఆయనను రాజకీయంగా ప్రవేశం కల్పించి ఎమ్మెల్యేని చేసింది ప్రజారాజ్యం పార్టీ అని గుర్తు చేస్తున్నారు. అయితే ఆయన ప్రజారాజ్యం కాంగ్రెస్ లో విలీనం అయినపుడు అందులో కొన్నాళ్ళు ఎమ్మెల్యేగా ఉన్నారు. 2014లో ఆయన టీడీపీలో చేరారు. అలా అనకాపల్లి ఎంపీ అయ్యారు. తిరిగి అయిదేళ్ళు గడవకుండానే టీడీపీని

మిగతా 2

(మొదటిపేజీ తరువాయి)

## ఏఐసీసీకి నో పవర్స్

ఎన్నికల నాటికి బలోపేతమై ప్రధాన పోటీదారుగా అవతరించాలని హస్తం నేతలు భావిస్తున్నారు. ఇటీవల గుజరాత్ లో నిర్వహించిన పార్టీ సమావేశంలో చర్చించిన మేరకు పార్టీ పునర్వ్యవస్థీకరణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇకపై ఢిల్లీ నుంచి తమ అభిప్రాయాలు రుద్ద కూడదని నిర్ణయించారు. దీనివల్ల క్షేత్ర స్థాయి పరిస్థితులు, పార్టీ బలాబలాలు తెలియడం లేదని చెబుతున్నారు. కొత్తగా తీసుకున్న నిర్ణయం ప్రకారం కాంగ్రెస్ లో జిల్లా, రాష్ట్ర కమిటీలకు విస్తృత అధికారాలు కట్టబెట్టాలని సన్నాహాలు జరుగుతున్నాయి. 1967 వరకు కాంగ్రెస్ లో ఇదే విధానం అమలులో ఉండేది. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను జిల్లా, రాష్ట్ర కమిటీలు సూచిస్తే అధిష్ఠానం వారికే టికెట్లు ఇచ్చేది. అయితే ఈ విధానాన్ని అటకెక్కించి ఏఐసీసీకి ఫుల్ పవర్స్ అప్పగించడంతో పార్టీ రివర్స్ గేర్ లో తిరోగమనం బాట పట్టిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా గత 11 ఏళ్లుగా ప్రతిపక్షంలో కొనసాగాల్సిన పరిస్థితులు ఏర్పడటం, ఈ 11 ఏళ్ల వ్యవధిలో అనేక రాష్ట్రాల్లో పట్టు కోల్పోవడంపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## ఠాక్రే బ్రదర్స్ దమ్ములు చూపిస్తారా ?

దశకంలో శివసేన ఎక్కువగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆ సమయంలో ఆయనను వెన్నంటి రాజ్ థాక్రే ఉండేవారు. ఇదిలా ఉంటే సొంత కొడుకు ఉద్ధవ్ థాక్రే 1985 బృహన్ ముంబై ఎన్నికల్లో శివసేన పార్టీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్ని పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించారు. 1990లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. ఇక 2002లో బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీని ఒంటి చేత్తో విజయ తీరాలకు చేర్చారు. . 2003లో శివసేన అధినేత బాల్ ఠాక్రే ఆయనను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. 2004లో శివసేన పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. అలా బాల్ థాక్రే తన సొంత కుమారుడు ఉద్ధవ్ థాక్రేకి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఆయననే తన అసలైన వారసుడిగా ప్రకటించేశారు. దాంతో రాజ్ కి బాల్ థాక్రేకి కొంత గ్యాప్ వచ్చింది. అలా 2005 నవంబరు 27న శివసేనకు రాజీనామా చేసి సొంత పార్టీని రాజ్ పెట్టుకున్నారు. దానికి మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన అని పేరు పెట్టుకున్నారు అయితే రాజ్ ఆ పార్టీ తరఫున పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. అంతే కాదు చట్ట సభలకు సైతం తాను ఒక్కడిగా కూడా గెలవలేకపోయారు. ఎంతో బలమైన నాయకుడిగా విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో కనిపించిన రాజ్ థాక్రే ఇప్పటిదాకా చట్ట సభలలో కాలు మోప లేకపోయారు అంటే ఆశ్చర్యంగా ఉంటుంది. ఆయన కంటే వెనక వచ్చిన ఉద్ధవ్ థాక్రే ఏకంగా సీఎం గా కూడా అయిపోయారు. ఇదిలా ఉంటే ఉద్ధవ్ థాక్రే తన వారసుడిగా బాల్ థాక్రే నిర్ధారించారు. దాంతో శివసేన యావత్తూ ఆయన వెంట నడిచింది. అయితే 2019 నుంచి 2022 మధ్యలో ఏక్ నాథ్ షిండే శివసేనను చీల్చేశారు. ఆయన పవర్ ఫుల్ మాస్ లీడర్. దాంతో శివసేన డీలా పడింది. తగిన వ్యూహాలు లేక 2024 లోక్ సభ ఎన్నికల్లో పెద్దగా పెర్ఫార్మెన్స్ చూపించలేకపోయింది. ఈ నేపథ్యంలో రాజ్ థాక్రే ఉద్ధవ్ థాక్రే ఇద్దరూ కలిసేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. మహారాష్ట్రలో హిందీ భాషను రుద్దుతామని అంటే తాము వ్యతిరేకిస్తామని ఉద్ధవ్ థాక్రే ప్రకటించారు.

## మెగా డీఎస్సీ బీ రెడీ

జూలై 6 వరకు నిర్వహించే పరీక్షలను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. 'ఫస్ట్ కమ్ ఫస్ట్' విధానంలో అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలు కేటాయిస్తారు. డీఎస్సీ దరఖాస్తులకు ప్రభుత్వం వయోపరిమితిని సడలించింది. 2024 జూలై 1 కటాఫ్ తేదీతో 18 నుంచి 44ఏళ్ల వయసున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వుడు కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితి 49ఏళ్లు, దివ్యాంగులకు 54ఏళ్లుగా నిర్ణయించింది. మరిన్ని వివరాలకు అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

ఇవీ అర్హతలు : స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాల్ పోస్టులకు వేర్వేరుగా అర్హతలను ప్రభుత్వం ప్రకటించింది. గత డీఎస్సీ సమయంలో ఉన్న ఎస్జీటీ పోస్టులకు అర్హత విషయంలో స్పష్టతనిచ్చింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్జీటీ పోస్టులకు డీఈడీ లేదా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ విద్యార్హత కలిగిన వారు మాత్రమే అర్హులు. ఇంటర్‌లో 50శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, విభిన్న ప్రతిభావంతులు అయితే 45శాతం మార్కులు సాధించి ఉండాలి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ, బీఈడీ ఉండాలి. వ్యాయామ విద్య ఉపాధ్యాయ పోస్టులకు డిగ్రీతో పాటు బీపీఈడీ లేదా ఎంపీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.

**టెట్‌కు 20శాతం వెయిటేజీ :** వ్యాయామ విద్య మినహా స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులకు టెట్‌లో 20శాతం వెయిటేజీ ఉంటుంది. మొత్తం పరీక్షల అనంతరం నార్మలైజేషన్ ప్రక్రియ తర్వాత తుది ఫలితాలు ప్రకటిస్తారు.

**ఓపెన్ కోటా 20శాతం :** టీచర్ పోస్టుల్లో 80శాతం పోస్టులు స్థానికులకే దక్కుతాయి. మిగిలిన 20శాతం ఓపెన్ కోటాగా ఉంటుంది. అందులో స్థానికులు, ఇతర జిల్లాల వారు, ఇతర రాష్ట్రాల వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర రాష్ట్రాల అభ్యర్థులు పదో తరగతిలో తెలుగు సబ్జెక్టు తప్పనిసరిగా చదివి ఉండాలి. దీంతో తెలంగాణ వారికి మాత్రమే ఇతర రాష్ట్రాల అభ్యర్థుల కింద అవకాశం దక్కుతుంది. అయితే హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకునేవారికి తెలుగుసబ్జెక్టు మినహాయింపు ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

**వారికి ఫీజు మినహాయింపు :** గత ప్రభుత్వంలో ప్రకటించి మధ్యలో ఆగిపోయిన డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, ఈ డీఎస్సీలో ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ కొత్తగా దరఖాస్తును నింపి అప్‌లోడ్ చేయాలి. ఒక్కో పోస్టుకు అభ్యర్థులు రూ.750 చొప్పున చెల్లించాలి. అందువల్ల గత డీఎస్సీలో ఒక పోస్టుకు ఫీజు చెల్లించినవారు ఇప్పుడు అంతకంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకుంటే, అదనంగా ఎంపిక చేసుకున్న పోస్టులకు రూ.750 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

**ఎస్సీ వర్గీకరణ అమలు :** డీఎస్సీలో ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ రోస్టర్ పాయింట్లు కేటాయించింది. ఎస్సీ 1, 2, 3 మూడు కేటగిరీలకూ పోస్టులు వేర్వేరుగా చూపించింది. దీంతో రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుచేసిన మొదటి నోటిఫికేషన్ ఇదే అవుతుంది.

**సోషల్, ఇంగ్లిష్ పోస్టులే ఎక్కువ :** మేనేజ్‌మెంట్ల వారీగా పోస్టులు చూస్తే ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో అత్యధికంగా 13,192 పోస్టులున్నాయి. వాటిలో 5,985 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో ప్రథమ భాష స్కూల్ అసిస్టెంట్ 534, హిందీ 492, ఇంగ్లిష్ 1,032, గణితం 655, ఫిజికల్ సైన్స్ 599, బయలాజికల్ సైన్స్ 902, సోషల్ స్టడీస్ 1,329, పీఈటీ 1,664 చొప్పున పోస్టులు ఉన్నాయి. మొదటి నుంచీ టీచర్ల కొరత ఎక్కువగా ఉన్న కర్నూలు జిల్లాకే అత్యధిక పోస్టులు కేటాయించారు. ఉమ్మడి కర్నూలులో 2,645 పోస్టులు భర్తీ చేయనున్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మొత్తం 881 పోస్టులు ఉండగా, అందులో 601 ఎస్జీటీ ఖాళీలున్నాయి. ఈ విభాగానికి సంబంధించి విశాఖపట్నంలో అత్యధికంగా 400 పోస్టులు ఇచ్చారు. విజయనగరంలో 137, తూర్పుగోదావరిలో 112, శ్రీకాకుళంలో 85 పోస్టులు మంజూరు చేశారు. మొత్తంగా 7,487 స్కూల్ అసిస్టెంట్, 6,599 ఎస్జీటీ పోస్టులున్నాయి.

**మూడు ప్రధాన మార్పులు :** ముందే సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయడం, ప్రాధాన్యాలు ఇవ్వడం, ప్రొవిజినల్ జాబితా లేకుండా నేరుగా తుది జాబితా ప్రకటించడం అనే మూడు ప్రధాన మార్పులు ఈ డీఎస్సీలో చేశారు. గతంలో దరఖాస్తు సమయంలో అభ్యర్థులు సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం ఉండేది కాదు. దానివల్ల పరీక్షల అనంతరం సర్టిఫికెట్ల పరిశీలనకు ఎక్కువ సమయం పట్టేది. ప్రస్తుత డీఎస్సీలో దరఖాస్తు సమయంలోనే అభ్యర్థులు అన్ని రకాల అర్హత సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) వివరాలు కూడా సమర్పించాలి. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను తొలుత పాఠశాల విద్యాశాఖ పరిశీలిస్తుంది. అనంతరం సాధారణ విధానంలో పరిశీలన ఉంటుంది. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటే ముందే ప్రాధాన్యాలు ఇవ్వాలి. అంటే ఒకే అభ్యర్థి గణితం, సైన్స్ రెండు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకుంటే తొలుత ఏ పోస్టు కావాలో ప్రాధాన్యం పేర్కొనాలి. తుది ఎంపికలో రెండు పోస్టులకు అర్హత సాధిస్తే తొలి ప్రాధాన్యానికి అనుగుణంగా ఎంపిక చేస్తారు. మిగిలినవి రద్దు అవుతాయి. దీనివల్ల పరీక్షల అనంతరం మళ్లీ ప్రాధాన్యాల ఎంపిక వివాదాలు తలెత్తవు. గతంలో తుది ఫలితాలు ప్రకటించాక కూడా పోస్టులు మిగిలిపోతే డీఎస్సీలో తర్వాత మెరిట్‌ను తీసుకునేవారు. అందుకోసం తొలుత ప్రొవిజినల్ జాబితా ప్రకటించేవారు. ప్రస్తుత డీఎస్సీలో నేరుగా తుది జాబితా ప్రకటిస్తారు. పోస్టుకు ఒకరిని చొప్పున ఎంపిక చేస్తారు. ఏవైనా కారణాలతో ఎంపిక చేసినవారు చేరకుండా పోస్టులు మిగిలిపోతే, వాటిని తర్వాత నోటిఫికేషన్‌కు క్యారీ ఫార్వర్డ్ చేస్తారు. మెరిట్‌లో తర్వాత వారికి అవకాశం ఇవ్వరు. దీనివల్ల న్యాయ వివాదాలు ఏర్పడవని అధికారులు చెబుతున్నారు.

## పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

ప్రసంగంలో ఆలోచనతో, స్వేచ్ఛ, సహనంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బాసిలికా బాల్కనీ నుండి 35 వేలకు పైగా జనం హాజరైన ఈ కార్యక్రమంలో పోప్ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫ్రాన్సిస్ తన సాంప్రదాయ "ఉర్బి ఎట్ ఓర్బి" ఆశీర్వాద పఠనాన్ని ఒక సహచరుడికి అప్పగించారు. మత స్వేచ్ఛ, ఆలోచన స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ, ఇతరుల అభిప్రాయాలను గౌరవించకుండా శాంతి ఉండదంటూ ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. యూదు వ్యతిరేకతను, గాజాలో పరిస్థితుల్ని ఆయన పరోక్షంగా ఖండించారు. ఆ తర్వాత ఇవాళ దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతూ పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూసినట్లు వాటికన్ ప్రకటించింది. రోమన్ కాథలిక్ చర్చికి మొదటి లాటిన్ అమెరికన్ నాయకుడు అయిన పోప్, తన పూర్వీకుడు బెనెడిక్ట్ రాజీనామా తర్వాత 2013లో పోప్ పదవిని అధిష్టించారు. పోప్ తన 12 సంవత్సరాల పదవీ కాలంలో పలు అనారోగ్యాలతో బాధపడ్డారు. ఇటీవల ఆయన డబుల్ న్యుమోనియా నుండి బయటపడ్డారు. అర్జెంటీనాలో జార్జ్ మారియో బెర్గోగ్లియోగా జన్మించిన ఫ్రాన్సిస్.. అమెరికా నుండి వచ్చిన మొదటి పోప్ కావడం విశేషం. ఆయన మార్చి 13, 2013న 76 సంవత్సరాల వయసులో పోప్‌గా ఎన్నికయ్యారు. పేదల పట్ల శ్రద్ధకు పేరు గాంచిన అర్జెంటీనా మతాధికారిని బయటి వ్యక్తిగా చూసిన అనేక మంది చర్చి పరిశీలకులను ఆయన ఆశ్చర్యపరిచారు. పిల్లల లైంగిక వేధింపుల కుంభకోణంపై దాడికి గురైన, వాటికన్ బ్యూరోక్రసీలో అంతర్గత కలహాలతో నలిగిపోయిన చర్చికి ఆయన నేతృత్వం వహించారు. 12 సంవత్సరాలకు పైగా పోప్ ఫ్రాన్సిస్ వాటికన్ బ్యూరోక్రసీని పునర్వ్యవస్థీకరించారు. అలాగే నాలుగు ప్రధాన బోధనా పత్రాలను రాశారు. 65 కంటే ఎక్కువ దేశాలకు 47 విదేశీ పర్యటనలు చేశారు. అలాగే 900కి పైగా సెయింట్స్ ను తయారు చేశారు.

## జపాన్‌లో రేవంత్ దూకుడు!

జరిగేది. అందుకు తగ్గట్లే వరుస ఒప్పందాలు చేసుకునేవారు. ఒకదశలో.. ఇలాంటి పని తెలంగాణలో మరెవరైనా చేయగలరా? అన్న సందేహానికి గురయ్యేవారు. అయితే.. ఆ విషయంలో ఎలాంటి లోటు అక్కర్లేదన్న విషయాన్ని దావోస్ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన సంకేతాల్ని ఇవ్వటం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దావోస్ వెళ్లినప్పటికి తెలంగాణ సీఎం రేవంత్ ప్రదర్శించిన దూకుడు.. చేసుకున్న ఒప్పందాలు రేవంత్ ఇమేజ్ ను పెంచేలా చేశాయి. తాజాగా ఆయన జపాన్ పర్యటనలో పలు సంస్థలతో ఇప్పటికే ఒప్పందాలు చేసుకోవటం తెలిసిందే. తాజాగా ఆయన పర్యావరణరహిత కిటాక్యయూషు నగరాన్ని సందర్శించారు. తన టీంతో కలిసి ఆ నగరాన్ని సందర్శించిన రేవంత్..అక్కడి ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకునినారు. పర్యావరణ పరిరక్షణ.. వ్యర్థాల నిర్వాహణ.. రీసైక్లింగ్ రంగాల్లో భాగస్వామ్యం పంచుకునేలా ఈ ఒప్పందాలు సాగాయి. పర్యావరణ అనుకూల సాంకేతికతలు.. పరిశుభ్రమైన నగర నమూనాలు.. నదుల పునర్జీవ విధానాలపై చర్చలు జరిపారు. అనంతరం హైదరాబాద్ లో ఎకో టౌన్ ఏర్పాటుకు సంబంధించి ఈఎక్స్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్.. పీ9 ఎల్ఎల్ సీ.. నిప్పాన్ స్టీల్ ఇంజినీరింగ్.. న్యూ కెమికల్ ట్రేడింగ్.. అమితా హోల్డింగ్స్ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ఒకప్పుడు అత్యంత కాలుష్య నగరాల్లో ఒకటిగా పేరున్న కిటాక్యూషు.. ఇప్పుడు అందుకు భిన్నంగా పరిశుభ్రమైన నదీ తీరంగా మారిన వైనాన్ని ప్రత్యక్షంగా పరిశీలించటమే కాదు.. హైదరాబాద్ మహానగరాన్ని కిటాక్యూషు మాదిరి శుభ్రమైన.. సుస్థిర నగరంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఒప్పందాలు సాగాయి.

## ఎంఐఎం దూకుడు!

ఎలానూ.. ఎంఐఎంకు.. పాతమిత్రుడే కాబట్టి ఇబ్బంది లేదు. కానీ.. పైకి మాత్రం ఎవరికీ ఓటేసేది లేదని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఇక, కాంగ్రెస్ కూడా ఎంఐఎంకు మద్దతు ఇస్తోంది. ఇటీవల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం కాంగ్రెస్‌కు సహకరించింది. దీంతో రుణం తీర్చుకునేందుకు కాంగ్రెస్‌కు ఇప్పుడు అవకాశం వచ్చింది. కట్ చేస్తే.. ఎంఐఎం గెలుపు ఖాయమేనని అనుకున్నా.. బీజేపీ కూడా అంతే సత్తాతో విజయం కోసం ప్రయత్ని స్తోంది. తమకు సన్నిహితంగా ఉన్న కాంగ్రెస్ కార్పొరేటర్లను బీజేపీ నాయకులు బుజ్జగిస్తున్నారు. ముఖ్యం గా కొందరితో విందు రాజకీయాలు కూడా చేస్తున్నట్టు రాజకీయ వర్గాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నా యి. ప్రధాన పోటీ దారుగా ఉ న్న ఎంఐఎం దారుస్సలాంలో భారీ ఎత్తున విందు ఏర్పాటు చేసింది. తన పార్టీ కార్పొరేటర్లకు.. ప్రత్యేక ఆహ్వానాలు కూడా పంపింది. ఓటు ఎలా వేయాలి.. ఎలా వ్యవహరించాలి..అనే విషయాలపై వివరించడంతోపాటు.. కార్పొరేట్లను సంతృప్తి పరిచేందుకు అసదుద్దీన్ ఈ విందు ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. మొత్తానికి ఎన్నికల పోలింగ్‌కు 48 గంటల ముందు.. ఎంఐఎం దూకుడు మరింత పెరగడం గమనార్హం.

## భూ అక్రమార్కుల మీద పవన్ కన్ను

భూ కబ్జాలు జరుగుతున్నాయని జనసేన ఆఫీసుకే నేరుగా ఫిర్యాదులు చేస్తున్నారు. తమ పేరుగా తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి మరీ దందాకోరులు ఈ విధంగా భూములు దోచుకుంటుంటున్నారు అని అంటున్నారు. దీంతో పవన్ ఏకంగా అధికారులతో టెలి కాంఫరెన్స్ నిర్వహించారు. తాను జిల్లా పర్యటనలు చేస్తాను అని కూడా వారికి స్పష్టం చేశారు. ప్రత్యేకించి భూ కబ్జాల మీదనే ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తాను అని చెప్పారని ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉంటే కాకినాడ విశాఖ జిల్లాలలో భూ కబ్జాల మీద ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు పవన్ సమాయత్తం అవుతున్నారని అంటున్నారు. ఆయన కలెక్టర్ జాయింట్ కలెక్టర్ల సమక్షంలోనే ఈ విధంగా చేస్తారు అని అంటున్నారు. అంటే మొత్తం అధికారికంగానే అన్న మాట. సరైన డాక్యుమెంట్లు లేకుండా కబ్జాలకు పాల్పడేవారి మీద సీరియస్ యాక్షన్ ఉంటుందని అంటున్నారు. భూ దందాల వల్ల ఇబ్బంది ప్రభుత్వానికి వస్తుందని అంటున్నారు. అందుకే పవన్ ఈ విషయంలో తానే స్వయంగా రంగంలోకి దిగాలని ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. మరో వైపు చూస్తే పవన్ కళ్యాణ్ కనుక కీలక జిల్లాలలో పర్యటన సందర్భంగా భూ దందాల మీద యాక్షన్ తీసుకుంటే అక్రమార్కుల గుండెలలో రైళ్ళు పరిగెడతాయని అంటున్నారు. నిజంగా కనుక పవన్ తలచుకుంటే భూబకాసురుల ఏరివేత కచ్చితంగా జరిగి తీరుతుంది అని అంటున్నారు. గతంలో ప్రభుత్వ భూములను కబ్జా చేసేవారు. ఇపుడు సామాన్యుల భూములు తీసుకుంటున్నారు. అమాయకుల భూములను ఆక్రమిస్తున్నారు. దీని కోసం తమ రాజకీయ పలుకుబడి ఉపయోగిస్తున్నారు తప్పుడు డాక్యుమెంట్లను క్రియేట్ చేస్తున్నారు. ప్రతీ జిల్లాలో ఈ విధంగా భూబకాసురుల బాధితులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరి విషయంలో కచ్చితంగా ఒక చూపు చూడాల్సిందే అని అంటున్నారు. మరి పవన్ ప్రకటించారు. ఎపుడు జిల్లాల టూర్లకు వస్తారు, భూ దందాల మీద ఏ రకమైన యాక్షన్ ప్లాన్ తో ముందుకు వెళ్తారు అన్న దాని మీద పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. నిజంగా పవన్ ఈ విధంగా చేస్తే కనుక అది రాజకీయ సంచలనమే అవుతుంది అని అంటున్నారు. ఎక్కువ కేసులు కానీ వివాదాలు కానీ భూముల చుట్టూనే ఉన్నాయని అంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వంలో కీలక స్థానంలో ఉన్న వారే జోక్యం చేసుకుని సరి చేస్తే అన్నీ ఒక కొలిక్కి వస్తాయని అంటున్నారు. సో పవన్ వారి గుండెలలో నిద్ర పోతారు అన్న మాట. వెయిట్ అండ్ సీ.

## వంశీకి ఊరట దక్కదా?

మధ్య చిక్కుకుపోయారంటున్నారు. దాదాపు ప్రతి కేసులోనూ కోర్టు రిమాండ్ విధిస్తుండటంతో వంశీ ఇప్పట్లో బయటకు వచ్చే సూచనలు కనిపించడం లేదంటున్నారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి మరోసారి నిరాశే ఎదురైంది. గన్నవరంలో స్థలం ఆక్రమణ అభియోగాలు ఎదుర్కొంటున్న వంశీకి బెయిల్ ఇవ్వాల్సిందిగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయస్థానం వారం రోజులకు వాయిదా వేసింది. వంశీ బెయిల్ పిటిషన్ పై ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు న్యాయవాది గడువు కోరడంతో హైకోర్టు కేసు విచారణను వాయిదా వేసింది. గన్నవరం టీడీపీ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ గా గతంలో పనిచేసిన సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేశారనే ఆరోపణతో వంశీని తొలుత అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత వంశీ బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి ఫిర్యాదు చేయడంతో పిటీ వారెంటుపై ఆయనను పోలీసులు కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి, సత్యవర్ధన్ కిడ్నాప్ కేసు, భూ ఆక్రమణలు, బెదిరింపులు వంటి కేసులు నమోదు అయ్యాయి. వీటిలో దేనికి ఇంతవరకు బెయిల్ లభించలేదని చెబుతున్నారు. దీంతో జైలులో ఆయన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబంపై పరుష పదజాలం వాడటమే వంశీకి ఇన్ని కష్టాలు వెంటాడుతున్నాయని అంటున్నారు. ఆయన విషయంలో కఠిన వైఖరి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంతో బెయిల్ పై విడుదలకు పోలీసులు సహరించడం లేదంటున్నారు.

## హెం మంత్రి ఇలాకాలో రగడ...!

ఉండడం.. నాయకులను పట్టించుకోకపోవడం.. వంటివి 2014-19 మధ్య అనితకు సెగపెట్టాయి. దీంతో ఆమె నియోజకవర్గాన్ని మార్చుకునే పరిస్థితి వచ్చింది. 2019 ఎన్నికల్లో కోవూరు నుంచి పోటీ చేసినప్పటికీ.. అనితకు ఫలితం దక్కలేదు. ఇదిలావుంటే.. 2024లో పాయకరావుపేటకు వెళ్లి.. అక్కడే పోటీ చేసి విజయం దక్కించుకున్నారు. అయితే.. స్వల్ప కాలంలోనే అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ గెలిచి 10 మాసాలే అయింది. అయితే.. ఓఎస్డీ రూపంలో అనిత చుట్టూ వివాదాలు ముసురుకున్నాయి. ఓఎస్డీ చేతివాటం కారణంగా విమర్శలు వచ్చాయి. దీంతో ఆయనను తప్పించారు. అయినప్పటికీ.. ఆరోపణలు మాత్రం ఆగడం లేదు. ఇదిలావుంటే.. నాయకులకు కూడా మంత్రి అందుబాటులో ఉండడంలేదని కొన్నాళ్లుగా ఆరోపణలు వస్తున్నాయి. నియోజకవర్గంలో నాయకులపై పట్టు లేకపోవడం.. సొంత నియోజకవర్గంలోనే శాంతి భద్రతల కు ఇబ్బందులు రావడం.. వంటివి కూడా మంత్రి సెగపెంచుతున్నాయి. ఇటీవల విశాఖ కార్పొరేషన్ విషయంలో తనకు సంబంధమే లేదన్నట్టుగా మంత్రి వ్యవహరించారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. నాయకులు అంతా ఒక్కటి.. ఆమె మాత్రం సెపరేటు అన్నట్టుగా ఇక్కడ రాజకీయాలు మారుతున్నాయి. గత ఎన్నికల సమయంలో అందరినీ కలుపుకొని పోతానని హామీ ఇచ్చినా.. ఇప్పుడు ఆ తరహా రాజకీయా లు చేయలేకపోతున్నారు. గ్రూపు రాజకీయాలకు పెట్టింది పేరైన పాయకరావుపేటలో అనితకు వ్యతిరేకం గా గ్రూపులు పెరుగుతున్నాయన్న వాదన బలంగా వినిపిస్తోంది. అయితే.. ఇది ఆమెకు మేలు చేయడం కన్నా.. ఇబ్బందిగానే మారుతుందని అంచనా వేస్తున్నారు. ఇక, మరోవైపు.. వైసీపీ కూడా.. ఇక్కడ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండడం గమనార్హం.

## అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ తో పాటు.... జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జి వి ఎమ్ సి చీఫ్ సిటీ ప్లానింగ్ అధికారి ప్రభాకర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి విచ్చేసిన అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అర్జీదారుని దరఖాస్తు ముగింపు చేసే ముందు జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని, అందువల్ల అర్జీలు పునరావృతం కాకుండా ఉంటాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. **అధికారులతో సమీక్ష సమావేశం :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో జిల్లాకలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ నకు అత్యంత ప్రాధాన్యత నిస్తుందన్నారు. సీఎంఓ కార్యాలయం, డిప్యూటీ సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపడంలో జిల్లాస్థాయి అధికారులు అత్యంత ప్రాధాన్యతతో తక్షణమే అర్జీదారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజు అధికారులు శాఖాపరమైన సమీక్ష నిర్వహించి, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ లో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా అర్జీలు ఎక్కువగా వస్తున్నట్లయితే ప్రత్యేక అధికారిని నియమించి అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పింఛన్ల పంపిణీ, అర్జీదారుల భూమి సమస్యలు పరిష్కరించడంలో క్రింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం లేదా బాధ్యతారాహిత్యం వహించినట్లయితే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్రోల్మెంట్ ఆఫ్ ఎంప్లాయిస్ ఇన్ హౌస్ హోల్డ్ సర్వే పెండింగ్ వివరాలను సంబంధిత అధికారుల నుండి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్రోల్మెంట్ కానీ వారి వివరాలను వారం రోజులలోపు నమోదు అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిదంగా విజన్ డాక్యుమెంట్ ప్రగతిని సమీక్షించారు. జిల్లాలో వివిధ శాఖలలో పెండింగ్ లో ఉన్న అర్జీల పై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీదారులతో స్వయంగా మాట్లాడి ఖచ్చితమైన సమాచారాన్ని అందించి, ఎటువంటి పొరపాట్లకు తావులేని విధంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పరిష్కరించిన అర్జీదారుల వద్దకు వెళ్లి వారి యొక్క ఫీడ్ బ్యాక్ ను సేకరించి మొబైల్ యాప్ ఫీడ్ బ్యాక్ కలెక్షన్ రిపోర్ట్ నందు నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ అదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 402 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 173 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 36, జీవీఎంసీ సంబంధించి 110 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 83 వినతులు వచ్చాయి. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.

## అవంతికి రూట్ క్లియర్ కావడం లేదా ?

వీడి 2019 ఎన్నికల వేళకు వైసీపీలో చేరారు. వైసీపీలో మూడేళ్ళ పాటు మంత్రిగా ఉన్నారు. అలా మంత్రిగా తన కోరికను తీర్చుకున్నారు. వైసీపీ నుంచి రెండు ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ని సంపాదించారు. వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఇక వైసీపీ ఓటమి తరువాత కూడా ఆరు నెలల పాటు అందులో ఉన్నారు. గత డిసెంబర్‌లో ఆ పార్టీకి రాజీనామా చేసిన అవంతి కూటమి వైపు చూస్తున్నారు. అయితే ఆయన రాజకీయ నిలకడ మీదనే కూటమి పార్టీలు సందేహం వ్యక్తం చేస్తున్నాయి. అధికారంలో ఉండే పార్టీలోనే ఆయన ఉంటారని గత పరిణామాలను గుర్తు చేస్తున్నారు. ఆయన మొత్తం రాజకీయ జీవితంలో ఎపుడూ విపక్ష ఎమ్మెల్యేగా లేరని అంటున్నారు. ఇక ఆయన వైసీపీ మంత్రిగా ఎమ్మెల్యేగా ఉన్నపుడు చంద్రబాబు లోకేష్ పవన్ ల మీద చేసిన కామెంట్స్ ని ఆయా పార్టీల నాయకులు మళ్ళీ బయటపెడుతున్నారు. అలాంటి వారిని చేర్చుకోవద్దని తమ పార్టీ పెద్దలను వారు కోరుతున్నారుట. ఇక అవంతి విషయానికి వస్తే బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు, అంగబలం అర్థబలం దండీగా ఉన్నారు. %ూశ్రీంశీ =ఘుస% - జగన్ రాజ గురువుకు భారీ షాక్ అయితే రాజకీయాల్లో ఇవొక్కటే కాదని వీటితో పాటుగా నిలకడ తనం కూడా అవసరం అని అంటున్నారు. చంద్రబాబు టీడీపీలో ఎంపీగా చేసినా 2019లో ఆయన పార్టీ మారడాన్ని తమ్ముళ్ళు గుర్తు చేస్తున్నారు. ఇక పవన్ కళ్యాణ్ అయితే వైసీపీ మంత్రిగా అవంతి ఉన్నపుడు బంతి పూబంతి చామంతి అని కామెంట్స్ చేసిన సంగతిని గుర్తు చేస్తున్నారు. మొత్తానికి అయితే అవంతి శ్రీనివాస్ ని జనసేనలో కానీ టీడీపీలో కానీ చేర్చుకోవద్దని పార్టీ నేతలు కోరుతున్నారుట. అయితే అవంతి జనసేనలో చేరుతారు అని ఆయన అనుచరులు చెబుతున్నారు. మరో వైపు అవంతి కూడా తన రాజకీయ ఫ్యూచర్ మీద ధీమాగానే ఉన్నారుట. అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగుతాయని అలా చాన్స్ వస్తుందని ఆయన భావిస్తున్నారుట. ఏదో ఒక పార్టీ నుంచి ఆహ్వానం వస్తుందని ఆయన ఆశతో ఉన్నారుట. ఏది ఏమైనా అవంతి కుమార్తె కూటమికి ఓటు వేయడంతో ఈ మాజీ మంత్రి అడుగులు ఆ వైపుగానే సాగుతున్నాయని అంటున్నారు. ఏమి జరుగుతుందో చూడాల్సి ఉంది.



# నిత్య "పరి" శ్రామికుడు అంబటి

## చాగల్లులో పూల కుండీల తయారీ యంత్రాన్ని రూపొందించిన తాపీ మేస్త్రి










**చాగల్లు, విశ్వంవాయిస్ న్యూస్ :** తాను చదువురాని వాడనని అతని ఏరోజు దిగులు చెందలేదు. ఆర్థిక ఇబ్బందులకు వెరవలేదు.. తన తండ్రి ఆశయాల కోసం తన రెక్కలు ముక్కలు చేసుకున్నారు. నిరంతర శ్రమ ఏదో సాధించాలన్న తపనతో ప్రయోగాలకు తెరలేపారు. తన దైనందిన వృత్తి జీవితంలో నూతన ఆవిష్కరణకు నడుంకట్టాడు.. పూల కుండీల తయారీ యంత్రాన్ని రూపకల్పన చేశారు. దీంతో మరో పదిమందికి ఉపాధి చూపిస్తూ ఎందరో విద్యావంతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. చాగల్లుకు చెందిన అంబటి సుబ్బారావు వివరాల్లోకెలితే....

తూర్పుగోదావరి జిల్లా చాగల్లు గ్రామానికి చెందిన అంబటి సుబ్బారావు ఏడాది పాటు కష్టపడి నూతన ఒరవడితో పూల కుండల తయారు చేసే యంత్రాన్ని రూపొందించారు. నాల్గవ తరగతి చదువుతూ ఆగిపోయినప్పటికి ఆయన తాతల కాలం నుంచి వారసత్వంగా వస్తున్న తాపీ పనిని వృత్తిగా ఎంచుకొని సిమెంట్ తూరలు తయారు చేయడంపై దృష్టి సాధించాడు. ఎందుకు పనికిరాని ట్రాక్టర్ ఇంజన్ ను తన తూరల యంత్రానికి అనువుగా మార్చుకున్నాడు. ట్రాక్టర్ ఇంజన్ ను బోరు చేయించి తిరిగి రన్నింగ్ లో పెట్టడానికి సుమారు రూ.30వేలు ఖర్చు చేశాడు. దీనిపై చాలామంది విమర్శలు చేసిన ఏమాత్రం వెనకాడకుండా తూరలు తయారు చేస్తున్నట్లు అయన చెప్పారు. దీనికి సంబంధించి రూ.80 వేలు ఖర్చు పెట్టినప్పటికీ అంచలంచెలుగా ఎదిగా తన వ్యాపారాన్నిఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు దాటించాడు. దీనిలో ఇనుప అచ్చులు, ప్లేట్లు , బెల్టులు డిస్క్ తదితర సామాగ్రి సమకూర్చేందుకు తన కుమారుడు వెల్డర్ సహాయాన్ని పొందినట్లు ఆయన తెలిపారు. తాను రూపొందించిన యంత్రంతో తురలతో పాటు తాజాగా పూలకుండీలు తయారు చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం వ్యక్తిగత నిర్మాణాలు పూర్తిచేసిన ఇంటి పైన డ్రాగన్ ఫ్రూట్స్ పండించేందుకు ప్రత్యేక విధానాన్ని అనుసరించినట్లు పేర్కొన్నారు. ఈ ఆధునిక తురలు, పులకుండీలు తయారు చేసిన యంత్రంతో తనతో పాటు పదిమందికి కూడా ఉపాధి చూపిస్తూ విమర్శించిన వారికే ఆదర్శంగా నిలిచాడు.

**గ్రామాల్లో సైతం పట్టణాలు మాదిరిగా :** గ్రామీణ ప్రాంతాల్లో సైతం పట్టణాల్లో మాదిరిగా నేను రూపొందించిన డ్రాగన్ ఫ్రూట్స్ కుండీలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రతిఒక్కరు ఇష్టపడుతున్నారు. నా కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని భావిస్తున్నాను. గతంలో తూరాలు తాయారు చేసిన యంత్రానికి జిల్లా పరిశ్రమల అధికారులు వచ్చి అన్నీరకాల అనుమతులు ఇచ్చి రుణం మంజూరు చేసారు. నిర్ణిత సమయంలో బాకీ చెల్లించాను. డ్రాగన్ ఫ్రూట్స్ సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఏర్పాటు చేసిన కుండీలు అందరికి సరసమైన ధరలు విక్రయించడంతో పాటు మొక్కలు సైతం తీసుకువచ్చి కుండీల్లో వేస్తాను. ప్రతి ఒక్కరు తమ ఇళ్ళపై ఖాళీ స్థలాల్లో వీటిని ఏర్పాటు చేసుకుని ఆరోగ్యకరంగా ఉండాలన్నది నా ఆశయం....

**అంబటి సుబ్బారావు, పులకుండీల రూపకర్త.**

### ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు

# ఉపకరణాల పంపిణీ శాసనసభ్యులు బండారు





**కొత్తపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం మండలాలలోని భవిత కేంద్రంలో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం స్థానిక శాసనసభ్యులు బండారు సత్యానంద రావు చేతుల మీదుగా జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, రావులపాలెం నందు జరిగినది. ఈ కార్యక్రమానికి జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ శ్రీ ఎం.వి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాసనసభ్యులు బండారు సత్యానందరావు, కొత్తపేట వారి చేతుల మీదుగా నాలుగు మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మొత్తం 45 ఉపకరణాలు -సిపి చైర్స్, వీల్ చైర్స్ ,హియరింగ్ ఎయిడ్స్, ట్రై సైకిల్స్ ,బ్రెయిలీ కిట్టు,మరియు రోలేటర్స్ పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్థానిక శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఆశలు-ఆశయాలు నెరవేరే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ,సమాజం వెన్నుతట్టి ప్రోత్సహించాలని వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని అన్నారు. వారు కూడా అందరిలాగే మంచి జీవితాన్ని జీవించటానికి కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు కుడిపూడి శ్రీనివాసరావు,మండల అభివృద్ధి అధికారి ఈ. ఉమామహేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి బి. శ్రీనివాసరాజు,గుత్తుల పట్టాభి,జక్కంపూడి వెంకటస్వామి,ఏఎల్ఎస్సి కో-ఆర్డినేటర్ డి. రమేష్ బాబు, నందం సత్యనారాయణ, ఐఆర్పి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### వెల్ల గ్రామంలో నూతన అంబేద్కర్, జగజ్జీవన్

# విగ్రహాలకు భూమి పూజ

## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం నియోజకవర్గం, విశ్వంవాయిస్ న్యూస్ :** సమాజంలో అసమానతలు రూపుమాపి,సమ సమాజ స్థాపనకు కృషి చేసిన నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,సంఘ సంస్కర్త,పూర్వ ఉప ప్రధాని,డా.బాబు జగజ్జీవన్ రామ్ లు నేటి తరానికి ఆదర్శనీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం వెల్ల గ్రామంలోని అరుంధతి పేటలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఇరువురి మహనీయుల విగ్రహాల నిర్మాణానికి సంబంధించి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ మాసం మహనీయులకు పుట్టింది పేరని,బాబు జగజ్జీవన్ రామ్,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే వంటి మహనీయులు ఏప్రిల్ లోనే జన్మించారని గుర్తు చేశారు. ఆ మహనీయులు చేసిన త్యాగాల వల్లే సమాజంలో వివక్ష, అసమానతలు నిర్మూలించబడ్డాయని అన్నారు. ఆ మహనీయులను స్మరణకు తెచ్చుకుని వారి బాటలో సాగిపోవాలని సూచించారు. డాక్టర్ అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాల స్థాపనకు తన చేతుల మీదుగా భూమి పూజ చేయడం తన అదృష్టమన్నారు మంత్రి సుభాష్. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఆకుల నారాయణరావు,ఎస్ ఎల్ టి అధినేత దూడల శ్రీనివాస్, దూడల నాగభూషణం, ఏసుబాబు, ఆకుల సతీష్, కొమ్మి రెడ్డి రాముడు, లంక మహేష్, సురేష్, పట్టాభి ఎన్డీఏ కూటమి నాయకులు, వెల్ల గ్రామ దళిత సంఘాల నేతలు వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

### మోకా వెంకట సుబ్బారావు స్వగృహానికి విచ్చేసిన

# కేంద్ర ఉక్కు శాఖ మంత్రి



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ మంత్రి సోమవారం బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు స్వగృహానికి వచ్చిన సందర్భంగా వారిని ఘనంగా సన్మానించడం జరిగింది మంత్రి వెంట బిజెపి పూర్వపు జిల్లా అధ్యక్షులు యాళ్ల దొరబాబు అమ్మడా చైర్మన్ అల్లాడ సోంబాబు మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ టిడిపి సీనియర్ నాయకులు గంధం పల్లంరాజు రేవు శ్రీను రాయపురెడ్డి రాజా దున్నాల దుర్గ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు ఉన్నారు.

### కోనసీమ రైల్వే పూర్తికి సహకారం అందిస్తానన్న

# కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

## కోనసీమ వాసుల కల సాకారం దిశగా అడుగులు స్వాగతిస్తున్నామన్న ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ ప్రజల చిరకాల వాంఛ రైల్వే ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు సహకరిస్తానన్న కేంద్ర సహాయ శాఖా మంత్రి శ్రీనివాస వర్మ వాఖ్యలను స్వాగతిస్తున్నామని అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు. కోనసీమ వాసుల కల సాకారం దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయని అన్నారు. నాడు తండ్రి బాలయోగి అంకురార్పణ చేసిన ఈ ప్రాజెక్టు ఆయన మరణం అనంతరం మరుగున పడిపోయిందని హరీశ్ పేర్కొన్నారు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ కాస్త ముందుకు సాగిందని 2019 లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టును పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం పనులు వేగవంతం అయ్యాయన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ప్రధాని మోడీ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు పూర్వ వైభవం వచ్చేలా కృషి చేస్తున్నారన్నారు. అలాగే అనకాపల్లిలో ఇటీవల భారీ పరిశ్రమలకు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అదే విధంగా కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ కూడా పూర్తి చేస్తామన్నారు.

### మేధావుల సమావేశానికి ముఖ్య అతిథిగా

# కేంద్ర ఉక్కు శాఖ మంత్రి



**అమలాపురం టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా కోనసీమ జిల్లా అమలాపురం, గడియార స్తంభం వద్ద గంగరాజు ఫంక్షన్ హాల్ లో,మేధావుల సమావేశం ఏర్పాటు చేసిన భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ్ణముఖ్య అతిథులుగా కేంద్ర ఉక్కు శాఖ మంత్రి వర్యులు శ్రీనివాస్ వర్మ,తణుకు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ముళ్ళపూడి రేణుక,రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు,కార్యక్రమ జోనల్ ఇంచార్జి అయ్యాజీ వేమా పాల్గొన్నార్ను ముళ్ళపూడి రేణుక మాట్లాడుతూ,ఇప్పటివరకూ108 సార్లు రాజ్యాంగ సవరణ జరిగితే,అందులో 90 సార్లు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాజ్యాంగ సవరణలు జరిగాయ్ని ఆర్టికల్ 370,మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి ముఖ్య విషయాలకు మాత్రమే బీజేపీ హయాంలో చట్ట సవరణలు జరిగాయని అన్నార్ను అంబేద్కర్ పుట్టిన స్థానం,చదువుకున్న స్థానం,బౌద్ధ మతం స్వీకరించిన ప్రదేశం,మరణించిన, అంతిమ సంస్కారం జరిపిన 5 క్షేత్రాలను పంచ తీర్థాలుగా భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం శాశ్వతంగా అంబేద్కర్ జ్ఞాపకాలను తీర్చిదిద్దిన ఘనతను సొంతం చేసుకున్న సంగతి గుర్తు చేశార్నుకేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ,పార్లమెంట్లో అంబేద్కర్ నిలువెత్తు ప్రతిమ ఏర్పాటు చేయడమే కాకుండా,అంబేద్కర్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తించిన తీరుకు నిరసనగా,1951లో రాజీనామా చేయడానికి కారణం,కాంగ్రెస్ పార్టీ అంటూ ఎద్దేవా చేశార్నుకార్యక్రమ జోనల్ ఇంచార్జి,రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు అయ్యాజీ వేమా మాట్లాడుతూ అనాటి కాంగ్రెస్ ప్రధానమంత్రి నెహ్రూ,అంబేద్కర్ పట్ల అనేక విధాలుగా వివక్షత ప్రదర్శించిందని ఆక్రోశం వెలిబుచ్చార్నుచివరికి బిజెపి మద్దతుతోనే అంబేద్కర్ కి భారతరత్న ఇవ్వడం జరిగిందని గుర్తుచేస్తూ,ఒక్క బీజేపీ మాత్రమే అంబేద్కర్ పట్ల నిజమైన అభిమానాన్ని చూపిస్తూ,అచిరకాలం జ్ఞాపకాలను పదిలపర్చిందని కొనియాడార్నుఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్, తమలంపూడి రామకృష్ణ రెడ్డి యాళ్ల దొరబాబు ,కర్రి చిట్టిబాబు,కలవకోలను తాతాజీ,పాలూరి సత్యానందం,ఇళ్ల సత్యనారాయణ,చికురుమిల్లి శ్రీనివాస్,ఆర్ వి నాయుడు,అయ్యగారి కృష్ణ సుందర్ ,ఆకుల వీరబాబు ,అల్లు భాస్కర్ పలువురు డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులు,ఉపాధ్యాయులు ఇతర రంగాల మేధావులు,బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంకా అభిమానులు పాల్గొన్నారు.

### రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షునికి

# కాంగ్రెస్ నేతలు అభినందనలు




**అమలాపురం టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులుగా నియమితులై మొదటిసారి అమలాపురం విచ్చేసిన కామన ప్రభాకర రావు ని కాంగ్రెస్ పార్టీ నాయకులు కలుసుకొని అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేకేసి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వంటెద్దు బాబి మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు షర్మిలమ్మ మీకు తగిన పదవి కట్టబెట్టారని మీలాంటి సీనియర్లే ఈ పదవికి న్యాయం చేయగలరని మీ ద్వారా రాష్ట్రంలో రైతన్నలకు న్యాయం జరగాలని రైతులకు ఉన్న సమస్యలు తీర్చే విధంగా మీరు పోరాటం చేయాలని మీ పోరాటంలో మా సహాయ సహకారాలు మీకు సంపూర్ణంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అభినందనలు తెలిపిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏఐసిసి మెంబర్ చీకట్ల అబ్బాయి,జగ్గప్ప రాజు, యార్లగడ్డ రవీంద్ర, అమలాపురం కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిని, కిసాన్ సెల్ రాష్ట్ర కన్వీనర్ దేశినీడి భాస్కరరావు, కేకేసి జిల్లా అధ్యక్షులు నీతుపూడి బాల సత్యనారాయణ, అప్పన శ్రీరామకృష్ణ, మాచవరపు శివన్నారాయణ, పోలిశెట్టి హరిబాబు, సంగీతం సత్యనారాయణ, ఏలేశ్వరపు రాధాకృష్ణ, సుగ్గు ప్రసాద్, దేవరపల్లి రాజేంద్ర బాబు, బి.ఏ.జె.రెడ్డి బాబు, చిట్టాల జోగేశ్వరరావు, మీసాల బాబి,ముల్లేటి వెంకటేశ్వరరావు,కుడిపూడి శ్రీనివాసరావు,మహబూబ్ షకీలా,భాస్కర్ రావు, వాండ్రాసి దుర్గారావు, దొరబాబు, బత్తుల సురేష్ బాబు, సుబ్రమణ్య శర్మ, భాస్కర్ రావు,నెల్లి వెంకటరమణ,ఆదుర్తి నారాయణ, గండిపూడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

### బోధనా పటిమ గల టీచర్లకు సంతృప్తికరమైనది

# ఉపాధ్యాయ వృత్తి గౌరవనీయమైనది

## ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**కొత్తపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** కొత్తపేట మండలం వాడపాలెం గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ గా పనిచేసి పదవీ విరమణ చేస్తున్న ఉపాధ్యాయిని గౌరీకృష్ణ వీడ్కోలు సభకు స్థానిక శాసన సభ్యులు బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్కూలు ప్రధానోపాధ్యాయులు వై. చంద్రశేఖరం ఈ సభకు అధ్యక్షత వహించారు. శాసన సభ్యులు సత్యానందరావు మాట్లాడుతూ వాడపాలెం పూర్వ వాస్తవ్యులు ఉత్తమ ఉపాధ్యాయులు అయిన దివంగత అద్దంకి కేశవరావు పద్మావతీ దంపతులు పనిచేసిన స్కూలులోనే వారి కోడలు గౌరీకృష్ణ టీచర్ గా పనిచేయడం, ఇక్కడే పదవీ విరమణ చేయడం యాదృచ్ఛికమే అయినా ఎంతో ఆనందదాయకం అన్నారు. ఇక్కడి వాతావరణం చూస్తుంటే గౌరీకృష్ణ టీచర్ విద్యా బోధనలో ఎంతటి ప్రతిభావంతురాలో అర్థం అవుతోందన్నారు. ఈమె భర్త బుద్ధుడు మాస్టారితో సహా కుటుంబీకులందరు దశాబ్దాలుగా విద్యాసేవకు అంకితమైనవారని ఆయన అన్నారు. ఈ స్కూలు ఒకప్పుడు ఎయిడెడ్ హయ్యర్ ఎలిమెంటరీ స్కూలుగా ఉన్నప్పుడు 1954,1957 సంవత్సరాలలో తీసిన రెండు అరుదైన గ్రూపు ఫోటోలు గౌరీ కృష్ణ బుద్ధచంద్రదేవ్ దంపతులు స్కూలుకు బహుమతిగా అందచేయడం ఎంతో అభినందించదగిన విషయమని ఆయన అన్నారు. స్కూలు యాజమాన్యము, గ్రామస్తులు, విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఆత్మీయంగా ఏర్పాటు చేసిన ఈ సత్కార కార్యక్రమానికి ఎంఇఒలు మట్టపర్తి హరిప్రసాద్,కె లీలావతి,గ్రామ పెద్ద చీకట్ల రామారావు, సర్పంచి త్సామా ఆదినారాయణ,వైస్ సర్పంచ్ ఎన్.సూర్యకాంతం, విద్యాకమిటీ చైర్మన్ సింగిరెడ్డి గోవిందస్వామి, వైస్ చైర్మన్ డి. సత్యవేణి, వార్డ్ మెంబర్ తల్లెమ్మ, మాజీ నీటి కమిటీ చైర్మన్ పెదపూడి బాపిరాజు, కృతా ఫౌండేషన్ తరఫున కరిబండి సుబ్బారావు, కురచ ప్రకాశరావు, స్కూలు ఫస్ట్ అసిస్టెంట్ ఎ.యల్. హేమసుందరి,స్కూల్ స్టాఫ్ సెక్రటరీ ఎన్ సత్య నారాయణరావు,జీవశాస్త్ర ఉపాధ్యాయులు బండారు నారాయణ,ఎన్. గోపి కృష్ణ, సాంఘికోపాధ్యాయులు ఎ. జీవరత్నం,పి, సంధ్య,తెలుగు భాషోపాధ్యాయులు ఎ. ఆర్. వి. కృష్ణ, టి. తులసిలక్ష్మీదేవి, ఆంగ్లోపాధ్యాయులు పి. భాగ్యవతీదేవి,పి.భానుమతి, వ్యాయామోపాధ్యాయిని ఎస్. వెంకటరమణ,గణిత శాస్త్ర ఉపాధ్యాయులు సి. హెచ్. లక్ష్మీనారాయణ,కె. కృష్ణప్రసాద్,డ్రాయింగ్ ఉపాధ్యాయులు సి. హెచ్. వి. వి. సత్యనారాయణమూర్తి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు కె.వి.వి.ఎస్.ఎన్. మూర్తి పాఠశాల ఉపాధ్యాయేతర సిబ్బంది, కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల,బాలికోన్నత పాఠశాలల టీచర్లు, పలివెల, గంటి,మోడేకుర్రు, చప్పిడివారిపాలెం, గొలకోటవారిపాలెం,వానపల్లి, తొత్తుపాడు,కొత్తపాలెం, మందపల్లి జడ్ పి పి ఉన్నత పాఠశాలల టీచర్లు, గౌరీ కృష్ణ టీచర్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

# ఎడిటర్ వాయిస్

## భగవత్ విద్వేషం

దేశ వ్యాప్తంగా ప్రజలందరికీ ఒకే గుడి, ఒకే బావి, ఒకే స్మశాన వాటికలకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ ఆదివారం తన అలీగఢ్ పర్యటనలో ఇచ్చిన పిలుపు రాజ్యాంగాన్ని సవాల్ చేయడమే అవుతుంది. సంఘ్ మూల సిద్ధాంతం హిందూ రాష్ట్ర స్థాపన దిశకు నడిపించడంగా పరిగణించాలి. భగవత్ విద్వేష వ్యాఖ్యలను రాజ్యాంగాన్ని ఆమోదించే, లౌకిక, ప్రజాస్వామ్యాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలి. దేశంలో మత విభజనకు ఒడిగట్టి భగవత్ ఇంతగా బరితెగించి విషం కక్కడం మోడీ ప్రభుత్వ అండతోనే సాధ్యమవుతుంది. దేశ సమైక్యతకు, సమగ్రతకు విఘాతం కలిగించే వారిపై దేశ ద్రోహం వంటి కఠిన సెక్షన్ల కింద కేసులు పెట్టి జైలుకు పంపాలి. భగవత్‌పై అది జరగలేదంటేనే బిజెపి, మోడీ ప్రభుత్వ మద్దతు ఏ స్థాయిలో ఉందో తేటతెల్లమవుతోంది. భారతదేశం విభిన్న మతాలు, కులాలు, జాతుల సమాహారం. భిన్నత్వంలో ఏకత్వం మన సంస్కృతి, సంప్రదాయం, వారసత్వం. ఈ సామాజిక వైవిధ్యంగానే లౌకిక రాజ్యంగా భారత్ అవతరించింది. రాజ్యాంగ స్వరూపానికి అదే పునాది. ఆసేతు హిమాచలం ప్రజలందరినీ దండలో దారంలా కలిపి ఉంచుతున్నదిదే. ఈ వ్యవస్థను విధ్వంసం చేయాలన్నది సంఘ్ చిరకాల వాంఛ. దానిలోనుంచి పుట్టినదే తాజాగా భగవత్ నోటి నుంచి ఆవిష్కృతమైన విద్వేష 'సందేశం'. ఆర్ఎస్ఎస్‌కు బిజెపి రాజకీయ విభాగం అన్నది బహిరంగ రహస్యం. కేంద్రంలో మోడీ అధికారంలోకొచ్చాక సంఘ్ మార్గదర్శకత్వంలోనే ప్రభుత్వం పని చేస్తోందనడానికి కేబినెట్ కూర్పు సహా పలు దృష్టాంతాలు కనిపిస్తాయి. ఎప్పటికప్పుడు నాగపూర్‌లోని సంఘ్ హెడ్‌క్వార్టర్‌కు ప్రోగ్రెస్ రిపోర్టులను సమర్పించి దిశా నిర్దేశాలను స్వీకరించడం తెలిసిందే. బిజెపి సర్కారు రెండవ తడవ పాలనా పగ్గాలు చేపట్టిన వెంటనే 370 ఆర్టికల్‌ను రద్దు చేసినా, మూడవ సారి పీఠం ఎక్కాక ముస్లింల లక్ష్యంగా వక్ఫ్ సవరణ చట్టాన్ని బుల్డోజ్ చేసినా సంఘ్ దీర్ఘకాలిక హిందూ రాజ్య స్థాపన ప్రాజెక్టులో భాగమే. ఒకే దేశం- ఒకే ఎన్నిక, ఒకే దేశం- ఒకే భాష, ఏక రూప పౌరస్మృతి, నూతన విద్యా విధానం%ౌ% ఇటువంటివన్నీ ఆర్ఎస్ఎస్ కర్మాగారంలో తయారైనవే. జమిలి ఎన్నికలనే తీసుకుంటే తమకు లోక్‌సభలో, రాజ్యసభలో మెజార్టీ లేకపోయినా ఆర్ఎస్ఎస్ అభిలాషకనుగుణంగా జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వరకు వెళ్లింది. ఆర్ఎస్ఎస్ రెండవ చీఫ్ గోల్వాల్కర్ తన సైద్ధాంతిక గ్రంథంలో ఒకే ఎన్నిక ప్రతిపాదన చేశారు. ఆ తోవకు మోడీ సర్కారు ప్రయత్నాలు ముమ్మరం కావిస్తోంది. ఈ మధ్యనే మోహన్ భగవత్ మసీదులను కూల్చి దేవాలయాలు నిర్మించడం, మసీదు లోపల శివలింగాలను కనుగొనడం మానుకోవాలని తమ శాఖలకు సూక్తి ముక్తావళి పఠించారు. అయోధ్య అనేది ప్రత్యేక పరిస్థితుల్లో తీసుకున్నదని, అది విజయవంతమైందని శెలవిచ్చారు. అంతలోనే ప్రజలందరికీ ఒకే గుడి, బడి, వల్లకాడు అంటున్నారు. ఆర్ఎస్ఎస్‌ది రెండు నాల్కల విధానమని, గోముఖ వ్యాఘ్రమని ఈ ఉదంతంతో రూఢ అవుతుంది. అయోధ్యపై సుప్రీం కోర్టు తీర్పు వచ్చినప్పుడు, తదుపరి వంతు మధుర, కాశీ%ౌ% అన్నారు. ఇటీవలనే జైపూర్ దర్గా హిందువులదన్న వివాదం లేవదీశారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో మసీదు కింద ఆలయం ఉందని సర్వే పేరిట నానా యాగీ చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని కులం మన దేశంలో వేల ఏళ్లుగా వేళ్లూనుకుంది. హిందూ మత రాజ్య స్థాపనకు కులం అవరోధమని ఆర్ఎస్ఎస్ ఎప్పుడో గుర్తించింది. కుల విభేదాలొద్దని భగవత్ చెప్పే సుద్దులు తన లక్ష్య సాధనలోనివే. జాతీయ ఐక్యత, సామాజిక ఏకత్వం, సామూహికంగా హిందూ పండగల నిర్వహణ%ౌ% ఇవన్నీ హిందూ రాష్ట్ర ప్రాజెక్టులోనివే. తన వందేళ్ల ప్రస్థానంలో వీటినే ఆర్ఎస్ఎస్ నమ్ముకొని అవకాశం చిక్కినప్పుడల్లా వాటిపై కేంద్రీకరించి పని చేస్తోంది. భగవత్ విద్రోహ వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలి. కేంద్రంలో మోడీ మనుగడకు భుజం కాసే పార్టీలు తమ వైఖరి చెప్పాలి. దేశ ఐక్యతను సవాల్ చేస్తున్న సంఘ్‌ను ఒంటరి చేసి దోషిగా నిలబెట్టేందుకు లౌకిక, ప్రజాస్వామిక వాదులు నడుం కట్టాల్సిన సమయమిది.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

## ద్వారపూడి రైల్వే స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించండి

### బిజెపి ఆధ్వర్యంలో ఎంపి హరీష్ కు వినతిపత్రం



**మండపేట టౌన్,** విశ్వం వాయిస్ : డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లోని ఏకైక రైల్వే స్టేషన్ లో సౌకర్యాలు కల్పించాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మధుర్ కు అమలాపురం లో సోమవారం వినతి పత్రాన్ని అందజేసినట్లు జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు కొన సత్యనారాయణ పేర్కొన్నారు. ద్వారపూడి రైల్వే స్టేషన్ లో పలు రైళ్లు కు హాల్ట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమలాపురం లోని బిజెపి నేత నల్లా పవన్ కుమార్ స్వగృహం లో పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాదుర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొన సత్యనారాయణ మాట్లాడుతూ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న ఏకైక రైల్వేస్టేషన్ ద్వారపూడి స్టేషన్ అన్నారు. రామచంద్రపురం, మండపేట నియోజక వర్గాలు తో పాటు చుట్టుపక్కల సుమారు 45 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ఈ రైల్వేస్టేషన్ లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్ లో నూతన వసతులు ఏర్పాటు చేయాలన్నారు. రత్నచల్, జన్మభూమి, షిరిడి సాయి , గోదావరి ఎక్స్ప్రెస్ రైలు హాల్టు లు ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన ఎంపీ గంటి హరీష్ మధుర్ తాను ద్వారపూడి రైల్వే స్టేషన్ లో సమస్యలు తెలుసుకునేందుకు విచ్చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కోనసీమ జిల్లా ఉపాధ్యక్షులు కోన సత్యనారాయణ, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వల్లభనేని రవీంద్రబాబు, మండపేట నియోజకవర్గం బిజెపి కోకన్వీనర్ కంకటాల మురళీకృష్ణ, జిల్లా బిజెపి పార్టీ ఉపాధ్యక్షులు చాట్రాతి జానకి రాంబాబు, ద్వారపూడి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు చింత దొరబాబు ,నరాల రాంబాబు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి

### రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విజనరీ లీడర్, నవ్యాంధ్ర సృష్టికర్త రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు ఆకాంక్షించారు. చంద్రబాబు నాయుడు 75 వ పుట్టినరోజు సందర్భంగా రాజమహేంద్రవరం మూడో డివిజన్ రాజేంద్రనగర్ రచ్చబండ వద్ద రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు ఆదేశాల మేరకు స్థానిక మూడవ వార్డు టిడిపి నాయకులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం 300 మంది మహిళలకు గిఫ్ట్ బాక్సులు, స్వీట్, బిరియాని ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుడుపూడి మాట్లాడుతూ చంద్రబాబు వంటి సమర్థవంతమైన నాయకుడి పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుని పోతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా బీసీ కులాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేస్తున్నారని, ఆయన సహకారంతో బీసీ కులాలు, కల్లుగీత కార్మికుల సంక్షేమానికి పనిచేసే అవకాశం శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గా తనకు రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. బీసీలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు అవసరమైన సహాయ సహకారాలను శెట్టిబలిజ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మరింత ప్రగతి పథంలోకి నడవాలని కోరారు. ఆయన వెంట పలువురు స్థానిక టిడిపి నాయకులు, మహిళా నాయకులు ఉన్నారు.

## కమ్యూనిటీ హాల్‌కు శంఖుస్థాపన

### ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.40.00 లక్షలు మంజూరు



**కపిలేశ్వరపురం మండలం, విశ్వం వాయిస్ :** కపిలేశ్వరపురం మండలం మాచర గ్రామంలో ఎం.పి ల్యాడ్స్ నిధులు రూ.40.00 లక్షలతో ఒ.సి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కు సోమవారం అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధూర్ శంఖుస్థాపన చేశారు. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా మండపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్ ఛార్జ్ వేగుళ్ళ లీలా కృష్ణ పాల్గొన్నారు. ఎం.పి హరీష్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు గా చంద్రబాబు నాయుడు ముందుకు వెళుతున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సూచనల ప్రకారం మండపేట నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఈ కమ్యూనిటీ హాల్ ను మంజూరు చేసి శంఖుస్థాపన చేశామన్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ మంజూరు రద్దు చేసిందన్నారు. ఎటువంటి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చెయ్యలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎం.పి హరీష్ మాధూర్ ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణం నకు రూ.40.00 లక్షలు మంజూరు చేశారన్నారు. అందుకు వారికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వేగుళ్ల లీలాకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక చెప్పిన ప్రతీ పని చేస్తున్నారన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కు నిధులు మంజూరు చేసినందుకు హరీష్ కు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో మండపేట నియోజకవర్గ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని ఎం.పి హరీష్ ను కోరారు. బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, అమలాపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి పుత్సల శ్రీను, కోరుమిల్లి సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, కపిలేశ్వరపురం సర్పంచ్ సాక శ్రీనివాసు, గొడవర్తి సత్యనారాయణ, గుడిసె ప్రసాద్, కోన భగవాన్, గుడాల చినరాజు, మట్టపర్తి శ్రీరామమూర్తి, వనుం వెంకన్న, జాస్తి అబ్బు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పువ్వుల చిట్టిబాబు, మాజీ ఎంపిపి నెక్కంటి రాంజి, చలికి నారయ్య, అడపా సత్తిబాబు, బడుగు నల్లయ్య, తదితర్లు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న బండారు





**కొత్తపేట విశ్వం వాయిస్ న్యూస్** యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరక ఐక్యడపాధ్యాయ ఫెరడేషన్ కొత్తపేట మండల శాఖ ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధి శాసన సభ్యులు బండారు సత్యానందరావు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం బలోపేతం చేయడానికి యుటిఎఫ్ చేస్తున్న కృషిని అభినందించారు. ప్రభుత్వం చేపడుతున్న తల్లికి వందనం, ప్రైమరీ స్కూల్ ఏర్పాటు, ఇతర సౌకర్యాల వివరించారు. మరొక అధిథిగా పాల్గొన్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరూ బడిలో చేరేటట్లు చేయడం, ప్రభుత్వ విద్యారంగం బలోపేతం ఈ కార్యక్రమ ఉద్దేశం అని పేర్కొన్నారు అనంతరం కొత్తపేట శివారు శ్రీనివాస్ పేటలో బండారు సత్యానందరావు తో పాటు నాయకులు ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఒడిఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావుగా ఉప సర్పంచ్ విళ్ళ మారుతి ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు కంఠంశెట్టి శ్రీనివాసరావు ముత్యాల బాబ్జి,వాసంశెట్టి సత్యనా నారాయణ, యుటిఎఫ్ నాయకులు వై. మురళి,టి.విజయకృష్ణ. కెపిహెచ్ సూర్యారావు,జి రామ్ కుమార్,ఎం నాగరాజు, గుత్తుల శ్రీనివాస రావు, సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ హరీష్ మధుర్ ద్వారపూడి రైల్వే స్టేషన్ అకస్మిక తనికి



మండపేట మండలం, విశ్వం వాయిస్ : మండపేట మండలం, ద్వారపూడిలో రైల్వే స్టేషన్ ను అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధూర్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ద్వారపూడి రైల్వే స్టేషన్ పై అనేక ఫిర్యాదులు రావటంతో మండపేట పర్యటనలో ఉన్న ఆయన ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మండపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్ ఛార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ గార్లతో కలసి ద్వారపూడి రైల్వే స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా సదరు రైల్వే స్టేషన్ లో స్టేషన్ మాస్టార్ లేకపోవంతో అక్కడి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని నెలలుగా కోచ్ పొజిషన్ తెలుపు బోర్డులు మరియు ట్రైన్ వివరాలు తెలుపు డిజిటల్ బోర్డులు పనిచేయకపోయిన ఎందుకు పట్టించుకోలేదని అధికారులను ఆరా తీశారు. టాయిలెట్స్ శుభ్రంగా లేకపోవటం, రిజర్వేషన్ కౌంటర్ ఒక్కటే ఉండటం గమనించారు. ప్రయాణికులకు కనీసం వాటర్ స్పెషిలిటీ కూడా సరిగా అందివ్వకపోవటంతో అసంతృప్తివ్యక్తం చేశారు. రెండు రోజుల తరువాత తాను మరలా వస్తానని అప్పటిలోగా ఈ ఇబ్బందులు అన్నీ సరిచేయాలని, స్టాఫ్ మొత్తం అందుబాటులో ఉండాలని ఎం.పి సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ ద్వారపూడి రైల్వే స్టేషన్ పై గతంలో తనకు కూడా అనేక ఫిర్యాదు వచ్చినవని దానితో ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని ద్వారపూడి రైల్వే అధికారులను అడిగినప్పటికీ ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ ఏనాడు తన దృష్టికి తీసుకురాలేదని ఎమ్మెల్యే అన్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ అవేమి పట్టనట్టు వ్యవహరించటం రైల్వే అధికారులకు తగదన్నారు. ఇప్పటికైనా సమస్యలన్నింటినీ త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులు సంఘం ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల సాయిరాం కన్నుమూత



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామ పంచాయతీ ఉద్యోగులకు ఏ కష్టం వచ్చినా ముందుండే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పంచాయతీ కార్యదర్శులు సంఘం ప్రధాన కార్యదర్శి మరియు రావులపాలెం మండలం గోపాలపురం పంచాయితీ కార్యదర్శి నిమ్మకాయల సాయిరాం సోమవారం మృతి చెందడం చాలాబాధాకరం..ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ.., శ్రద్ధాంజలి ఘటిస్తూ.,వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మరియు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పంచాయతీ కార్యదర్శులు సంఘం

## రామచంద్రపురంలో వక్ఫ్ సవరణ చట్టాన్ని నిరసిస్తూ ర్యాలి




**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ ఆర్టికల్ 25కి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేసిన వక్ఫ్ సవరణ చట్టాన్ని నిరసిస్తూ డాక్టర బి.అర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గంలో ఉన్న రామచంద్రపురం పట్టణ మరియు ద్రాక్షారామ, దొడ్డంపేట,చేదువాడ, కాజులూరు,గొల్లపాలెం, అంజూరు,పసలపూడి, గ్రామాల నుంచీ పెద్ద సంఖ్యలో ముస్లింలు శాంతియుత నిరసన ర్యాలీని ద్రాక్షారామ యానాం సెంటర్ నుంచీ బయలుదేరి రాజగోపాల్ సెంటర్ కి చేరుకొని అక్కడ మానవహారంగా చేసి అక్కడ నుండి అర్డిఓ ఆఫీస్ వరకు ముస్లిం స్త్రీ పురుషులు సామాజిక వేత్తలు.లౌకికవాదులు. రాజకీయ ప్రతినిధులు. కమ్యూనిస్టు సోదరులు. వక్ఫ సవరణ చట్టంలోని లోపాలను వివరించి మా నీరసనను మా ఆవేదన కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్రపతి వారి వరకు తెలియ చేయాలని ఆర్డీఓ అఖిల కి వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమాన్ని రామచంద్రపురం నియోజకవర్గ వక్ఫ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడమైనది.

## అట్టహాసంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభం



**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజవర్గం తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయంను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆయన తండ్రి వాసంశెట్టి సత్యం,జనసేన ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్లు ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. స్థానిక రత్నంపేట లోని సువిసాలమైన భవనంలో నూతన కార్యాలయాన్ని ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ప్రారంభించారు. మొదట మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం పుణ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి,వేద పండితుల మంత్రోచ్ఛరణలు, ఆశీర్వాదాలు మధ్య పూజలు చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. పాత పార్టీ కార్యాలయం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఉండే విషయం విదితమే. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజవర్గంలోని ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు



**అంబాజీపేట విశ్వం వాయిస్ న్యూస్**


రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75 పుట్టినరోజు సందర్భంగా పుల్లేటికుర్రు లో కూటమి ప్రభుత్వం నాయకత్వంలో తెలుగుదేశం జనసేన, బిజెపి ఆధ్వర్యంలో పుల్లేటికుర్రు లో సీఎం చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలకు చీరలు, పురుషులకు దుప్పట్లు , బ్రెడ్లు , పండ్లు 50 మందికి పంపిణీ కార్యక్రమం జరిగింది. తొలుత కేక్ కటింగ్ చేసి అభిమానులకు పంచిపెట్టారు . ఈ కార్యక్రమంలో సహకరించిన వారు ఎన్టీఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య , సర్పంచ్ జల్లిబాలరాజు , ఉప సర్పంచ్ వీరా రవి జనసేన గ్రామ శాఖ బొరుసు రాజా , బిజెపి నాయకులు ఆకెళ్ళ సూరిబాబు , పాలకవర్గ సభ్యులు కోటా కృష్ణారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కత్తుల బాలరాజు, గోడ వెంకటరావు , నూకపై వర్మ గ్రామ శాఖ ఎక్స్ సెక్రెటరీ డాక్టర్ రామకృష్ణ , సీనియర్ నాయకులు మర్రి రామకృష్ణ , బాసిన సురేష్ , సీనియర్ నాయకులు బోనం నాని , గుమ్మడి రాజు , పిచ్చిగా ప్రసాద్ లు ఈ కార్యక్రమంలో పాల్గొని సహకరించి చీరలు , దుప్పట్లు పండ్లు , బ్రెడ్లు పంపిణీ చేశారు . తొలుత పుల్లేటికుర్రు లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## విద్యార్థి సాయి లక్ష్మి ని ప్రత్యేకంగా అభినందించిన జిల్లా కలెక్టర్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ పీ.ఆర్.ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని డీ.సాయిలక్ష్మి ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో 982 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మొట్టమొదటి స్థానం సంపాదించింది. ఈ నెల 15న అమరావతిలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ నిర్వహించిన షైనింగ్ స్టార్స్ ఏపీ కార్యక్రమంలో ఆమెకు మంత్రి లోకేష్ చేతులు మీదుగా మెడల్, ల్యాప్ టాప్ అందుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో జరుగుతున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ను డీ.సాయిలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.తిరుపతి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

## సమస్యలు పరిష్కరించాలని ఇంటర్ విద్య విశ్రాంత ఉద్యోగుల వినతి



**కాకినాడ సిటీ, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ విద్య పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇంటర్మీడియట్ విద్య విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సంఘ జిల్లా అధ్యక్షులు కెపి. జగదీశ్వరరావు, కార్యదర్శి ఎ. శివకుమార్, ప్రాంతీయ ఉపాధ్యక్షుడు బిటివివి. పేర్రాజు జిల్లా రెవిన్యూ అధికారి కె.వెంకట్రావు కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2018నుండి రావలసిన డిఆర్, 11వ పీఆర్సీ బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరారు. ఈహెచ్ఎస్ పథకంలో విశ్రాంత ఉద్యోగులకు అన్ని వ్యాధులకు అన్ని హాస్పిటల్స్ లో వైద్యం అందించాలని, మెడికల్ రీయింబర్స్మెంట్ 2నుండి 5లక్షలకు పెంచాలని అన్నారు. క్వాంటం పెన్షన్ 10 శాతానికి,12నుండి 15శాతానికి పెంచాలని అన్నారు.12వ పీఆర్సీ కమిషన్ నియమించి, ఐఆర్ ప్రకటించాలని,పెండింగ్ 3డిఆర్లు ప్రకటించాలని కోరారు.కార్యక్రమంలో పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.







### మజ్జిగ పంపిణీ కార్యక్రమం
## చేసిన గంగాధర్



**కాకినాడ సిటీ: విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కాకినాడ సిటీలో వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో పేదవాళ్ల దాహార్తిని తీర్చడం కోసం సోమవారం నాడు కాకినాడ 11 వ డివిజన్ అన్న క్యాంటీన్ దగ్గర భారతీయ జనతా పార్టీ కాకినాడ కో కన్వీనర్ కొండేటి గంగాధర్ ఆధ్వర్యంలో చిట్టిబాబు ఇయ్యపు నూకరాజు బుజ్జి ప్రోత్సాహంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకినాడ సిటీ కన్వీనర్ గట్టి సత్యనారాయణ,రాష్ట్ర మీడియాప్రతినిధిఎనిమిరెడ్డి మాలకొండయ్య పాల్గొన్నారు.బీజేపీ సీనియర్ నాయకులు దిలీప్ కుమార్ సదనాని, కుండల సాయికుమార్, నక్క రాణి,ముమ్మిడి విజయ లక్ష్మి మూర్తి, అప్పారావు ,ప్రసాద్ ,నర్ల విజయలక్ష్మి, రాజేందర్ చెక్క రమేష్, దొడ్డి వీరేంద్ర , కొండేటి సత్యనారాయణ,బీజేపీకార్యకర్తలునాయకులు, తదితరులు పాల్గొనడం జరిగింది. వచ్చిన ప్రతి ఒక్కరు గంగాధర్ ను అభినందించారు.

### ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే
## ధాన్యం కొనుగోలు చేయాలి



**కాజులూరు, విశ్వంవాయిస్ న్యూస్:** ధాన్యం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేయాలని రైతులు కూడాఆర్ బీ కే కేంద్రాల ద్వారా సీఎంఆర్ కే అమ్మాలని అప్పుడు మాత్రమే పూర్తి మద్దతు ధర వస్తుందని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లి రాజబాబు కాజులూరు మండలం వంటి తాడి కాజులూరు చేదువాడ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలని కొంతమంది మిల్లర్స్ ప్రైవేటు వ్యక్తుల ద్వారా తక్కువ ధరకు కొనుగోలు చేయాలని ప్రయత్నిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర రైతుల పెట్టిన పెట్టుబడికి ఏమాత్రం సరిపోదని రైతాంగం అప్పుల పాలవుతున్నారని అన్నారు. ఒక ప్రక్క పెరిగిన ఎరువులు పురుగు మందుల ధరలు మరోప్రక్క వరి కోత యంత్రాలు మరియు కౌలు కలగలిపి రైతులకు ఏమి మిగలటం లేదని మిల్లర్లు మధ్య వర్తుల ద్వారా కొనుగోలు చేస్తున్నారని ఇప్పటివరకు 75 కేజీల బస్తాకు 1600 ఇస్తున్నప్పటికీ మరో 50 రూపాయలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని రైతులు ముందుచూపుతో సీఎంఆర్ ద్వారా అమ్ముకుంటే డబ్బులు కూడా తొందరగా వస్తున్నాయని రైతులు మోసపోవద్దని అలాగే ప్రభుత్వం డిమాండ్ కు తగ్గట్టుగా కొత్త గోనె సంచులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు .ఈ కార్యక్రమంలో బుడితి ప్రభాకర్ రావు ,నామచంద్రరావు విరవాడ బాబ్జి ,ఎస్ నూకరాజు ,ఏళ్ల పుల్లయ్య ,ఎం యాకోబు పాల్గొన్నారు.

## ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు పూర్తి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరంలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల(ఏపి.మోడల్ స్కూల్)లో ఆరవ తరగతిలోకి సోమవారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు సజావుగా పూర్తి అయ్యాయి. చీఫ్ సూపర్వైజర్ వైఎస్వి కిరణ్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్, మండపం జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు జి.శేఖర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఈ ప్రవేశ పరీక్షలకు మొత్తం 289 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 240 మంది మాత్రమే పరీక్షలకు హాజరు అయ్యారు. వాతావరణం వేడిగా ఉండటంతో విద్యార్థుల కోసం చల్లటి తాగు నీటిని, పరీక్షల గదుల్లో గాలి పంఖాలను ఏర్పాటు చేపట్టినట్లు, పరీక్షలను ఆసాంతం విజయవంతంగా నిర్వహించడానికి సిబ్బంది అందరూ బాగా సహకరించారని, అలాగే పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన మండల విద్యాశాఖ అధికారి సూరిశెట్టి వెంకటరమణ పరీక్షల సక్రమ నిర్వహణ పట్ల తన సంతృప్తిని వ్యక్తం చేశారని, పరీక్ష ఫలితాలను ఈ నెల 27న విడుదల చేస్తామని ఏపి. మోడల్ స్కూల్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ వైఎస్వి కిరణ్ ఒక ప్రకటనలో మీడియాకు తెలిపారు.

### మల్లం సాంఘిక బహిష్కరణపై
# పవన్ కళ్యాణ్ స్పందించాలి

**ఇప్పటికీ కొనసాగుతున్న సాంఘిక బహిష్కరణ.. పోలీసుల సాయంతో నిత్యావసర వస్తువుల కొనుగోలు**

**మృతి చెందిన పల్లపు సురేష్ కుటుంబాన్ని పవన్ పరామర్శించాలి**

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు... చంద్రన్న బీమా పథకం పల్లపు సురేష్ కుటుంబానికి వర్తింప చేయాలి**

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్**

**పల్లపు సురేష్ కుటుంబాన్ని ఆదుకుంటాం -ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దానం లాజరు బాబు**





**పిఠాపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లం గ్రామంలో ఎస్సీలను సాంఘిక బహిష్కరణ చేసిన ఘటనపై నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర డిప్యూటీ చీఫ్ మినిస్టర్ పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించాలని ఈ నెల 16న విద్యుత్ పనుల్లో మరణించిన పల్లపు సురేష్ బాబు కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం 7:00 నుండి 9 గంటల వరకు సిపిఐ, ఏఐటియుసి, దళిత హక్కుల సమితి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సమైక్య తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మల్లం గ్రామం లో పర్యటించి జరిగిన సంఘటన తెలుసుకొని బాధి కుటుంబాన్ని పరామర్శించారు. అక్కడ రెండు రోజులు పాటు జరుగుతున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. సురేష్ బాబు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ మల్లం గ్రామానికి చెందిన ఒక అగ్రకులం వారి ఇంట్లో పల్లపు సురేష్ బాబు విద్యుత్ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు మృతి చెందడం జరిగింది. దానిపై ఇది వర్గాల పెద్దలు కూర్చుని కుటుంబానికి రెండు లక్షల 75000 సహాయం చేయాలని నిర్ణయించడం జరిగింది. మమ్మలనే నష్టపరిహారం అడిగారనే ధోరణిలో అగ్రకులాల పెద్దలందరూ దళిత కుటుంబాలందరినీ సాంఘిక బహిష్కరించాలనేది నిర్ణయించుకుని గ్రామంలో ఉన్న దళితులకు పాలు తాగే చంటి పిల్లల సైతం పాలు ఇవ్వద్దని, టిఫిన్ సెంటర్ టిఫిన్లు వారికి అమ్మకూడదని, కిరణా వ్యాపారుల కిరాణా ఇవ్వకూడదని, చివరకు బయట నుండి వచ్చే చేపల గంపల్ని కూడా వెనక పంపడం జరిగిందని ఇది అవమానియా ఘటనని మధు అన్నారు. దీనిపై నియోజకవర్గ ఎమ్మెల్యే మంత్రి పవన్ కళ్యాణ్ గారు వెంటనే స్పందించి కుటుంబానికి న్యాయం చేయాలని, అంతేకాకుండా భవిష్యత్తులో ఇలాంటి సాంఘిక బహిష్కరణ ఘటనలు జరగకుండా చూడవలసిన బాధ్యత ఆయనకే ఉందని మధు అన్నారు. ఆ గ్రామ అగ్రకుల పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని మధు అన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సును అమలు చేయాలని ఆయన కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘాలుగా ఎన్నో ఆందోళన చేస్తున్న ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పథకాల అమలు జరిగి ఉండుంటే ఈరోజు పల్లపు సురేష్ భవన నిర్మాణ కార్మికుడు ఎలక్ట్రిషన్కు 5 లక్షల ఆర్థిక సహాయం అందేదని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చంద్రన్న బీమా పథకం ద్వారా సురేష్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ప్రసాదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దానం లాజర్ బాబు మాట్లాడుతూ పల్లపు సురేష్ బాబు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ప్రభుత్వం దృష్టికి పల్లపు సురేష్ మృతి విషయాన్ని తెలియజేస్తామని ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయం అందించేందుకు నా వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కేశవరపు అప్పలరాజు,దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి శాఖ రామకృష్ణ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నక్క శ్రీనివాసరావు, మహిళా సమైక్య తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి పి లావణ్య, కాకినాడ జిల్లా కన్వీనర్ భవాని, ఎస్సీ సంఘాలు, ప్రజా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ పిజిఆర్ఎస్ కు 78 ఫిర్యాదులు

**జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ జి.బిందు మాదవ్**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ కార్యక్రమమునకు 78 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను జిల్లా ఎస్పీ కి స్వయంగా తెలియచేసుకున్నారు. ప్రజల నుండి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించవలసిందిగా ఆదేశాలు, సూచనలు జారిచేసారు జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాలలోను, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునని, ఆ ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి, సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్ తెలిపారు.

## పిల్లల్ని ప్రభుత్వ పాఠశాల ల్లో చేర్చండి యు టి ఎఫ్ ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పిలుపు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఎన్ టి ఆర్ నగర్ లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మునిసిపల్ పాఠశాల ఆవాసం లో యు టి ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు ప్రతీ ఇంటింటికి తిరిగి ప్రైవేట్ పాఠశాల ల్లో చదివే పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లి తండ్రులకు విజ్ఞప్తి చేశారు. అమ్మకు వందనంతో తో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు, కంప్యూటర్ విద్య, వ్యాయామవిద్య, మంచి యూనిఫామ్, షూస్,బ్యాగ్ తో పాటు నోట్ బుక్స్ ఇస్తున్నామని, తమ పార్టీ తెచ్చిన స్మార్ట్ సిటీ నిధులతో పాఠశాలల్ని ఎంతో అభివృద్ధి చేసామని,విద్యార్థులకు ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్,కొత్త మెనూ తో మంచి మధ్యాహ్న భోజనాన్ని గుడ్డుతో అందించనున్నామని, శిక్షణ ఉపాధ్యాయులు వున్నారని, ఇంకా ఉపాధ్యాయుల్ని డీఎస్సీ ద్వారా నియమిస్తున్నామని ప్రజలు నాణ్యమైన విద్య కొరకు ప్రభుత్వ పాఠశాల ల్లో చేర్పించాలని కోరారు. ఎమ్మెల్యే సమక్షంలో ఈరోజు సుమారు 20మంది విద్యార్థులను చేర్పించారు. ఎమ్ ఈ ఓ లు కె వి వి సత్యనారాయణ, చెవ్వూరి రవి,మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందించడానికి తాము భరోసా ఇస్తున్నామని, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలని, విద్యా శాఖ తరపున హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయురాలుకె.సింహాద్రి,ఉపాధ్యాయులు యు టి ఎఫ్ నాయకులు సిహెచ్ వి రమణ, బి రవి శ్రీనివాస్, సిహెచ్ వరహాల బాబు,వజ్రపు మహేష్, వాడపర్తి శ్రీనివాస్, పి కృష్ణం రాజు,పి రాజుబాబు, కె సుబ్బారావుతదితర యూ టీ ఎఫ్ నాయకులు సుమారు 50మంది ఉపాధ్యాయులు పాల్గొనగా, స్థానిక టీడీపీ ఇంచార్జులు దుర్గా ప్రసాద్, జాన్ వెస్లీ తో పాటు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### కలెక్టర్ పిజిఆర్ఎస్‌కు
## 503 వినతులు

**స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, త్వరగా పరిష్కారం చేయాలి : జిల్లా కలెక్టర్**



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం(పీజీఆర్ఎస్) సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జాయింట్ జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ. సత్యనారాయణబీ కేఎస్ఈజెడ్ ఎస్డీసీ కెవీ.రామలక్ష్మి, సి పి ఓ త్రినాద్, డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ ఇతర అధికారులతో కలిసి హాజరై, కాకినాడ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవిన్యూ, పింఛన్ల, బియ్యం కార్డు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలిగింపు, మత్స్యకార భరోసా , డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు వంటి అంశాలకు చెందిన మొత్తం 503 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన వినతులను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారంచూపాలని ఆయన స్పష్టం చేశారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

### వడ్డి ఏడుకొండలును సత్కరించిన
## ప్రజాసంఘాల నాయకులు



**తాళ్లరేవు, ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్:** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం సుంకరపాలెం గ్రామానికి చెందిన జాతీయ అవార్డు గ్రహీత వడ్డి ఏడుకొండలును అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం ముమ్మిడివరం అంబేద్కర్ కన్వర్షన్ హాల్ నందు విశ్వజన కళామండలి సభ్యులు మరియు ఇతర సంఘాలు కలిసి సోమవార నంది పురస్కార జాతీయ అవార్డు గ్రహీత విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డీ ఏడుకొండలు ను ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ అనునిత్యం ప్రజలలో ఉంటూ బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు నిరంతరం కృషి చేస్తూ పేద ప్రజల సమస్యలు పై పరిష్కారంలో భాగంగా వడ్డీ ఏడుకొండలు కు రాజమండ్రిలో జరిగిన ఉగాది నంది పుష్కర అవార్డు సభలో ఆంధ్ర ప్రదేశ్ సంస్కృతిక పర్యాటక సినీ శాఖ ఫోటోగ్రఫీ శాఖ మత్తులు కందుల దుర్గేష్ మరియు గజల్ శ్రీనివాస్ చేతుల మీదగా ఉగాది దినం తీసుకోవడం గర్వించదగ్గ విషయంగా చెప్పారు. బుష్యం సత్యనారాయణ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశ నుండి ఏడుకొండలకు ఉన్నాయని ,దళిత ఉద్యమాలలో తన యొక్క పాత్ర ఎంతో ఉందని అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్వజన కళామండలి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వెండి కమల రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల సురేష్ కుమార్ జిల్లా అధ్యక్షులు గేద్దం శ్రీనివాస్ ఎలమంచిల బాలరాజు పినిపే వీర వెంకట శాస్త్రి ఎడ్ల వీర వెంకట ప్రసాద్ శీలం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయం

## అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఎమ్మెల్యే ఆదిరెడ్డి ప్రారంభం





**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** స్థానిక జెండా పంజా రోడ్ లో ది.రాజమహేంద్రవరం మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చేతులమీదగా చలివేంద్రం ప్రారంభించారు. రాజమహేంద్రవరం మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ గతంలో కూడా ఇలాంటి సామాజిక కార్యక్రమాలు మెగా బ్లడ్ క్యాంపు, మెగా మెడికల్ క్యాంపు, పేదలకు ఉచిత దుప్పట్లు, బట్టలు, రొట్టెలు,పళ్ళు పంపిణీలు మొదలగునవి ఎన్నో నిర్వహించుకుంటూ వచ్చాము అని తెలిపారు.బాటసారులకు చల్లని కూల్ డ్రింక్స్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి, అసోసియేషన్ సభ్యులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఎం టి ఏ స్టేట్ ప్రెసిడెంట్ బి వేణుగోపాల్, రాజమహేంద్రవరం ప్రెసిడెంట్ ఖలీల్ , కమిటీ సభ్యులు, మరియు పలువురు టెక్నీషియన్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నగర సెక్రటరీ హేమంత్ నిర్వహించడం జరిగింది.

# హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ సభ్యురాలు రత్నంకు అభినందన



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్ :** హ్యూమన్ రైట్స్ యాంటి కరప్షన్ అసోసియేషన్ సభ్యురాలుగా నియమితులైన తుపాకుల రత్నంను పలువురు ప్రముఖులు అభినందించి ఆత్మీయ సత్కారం చేశారు.మున్సిపల్ కాలనీలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఉమెన్ అండ్ చైల్డ్ ఫ్రెండ్లీ సిటీ అధ్యక్షుడు అమిర్ పాషా,పాస్టర్ ఈ.అబ్బులు, ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైషన్ రాష్ట్ర ఉపాధక్యులు పొన్నల దినకర్, నెల్లిపూడిరాజు, ఎం.సీతారామ్, ఎన్.కిరణ్, కె.చిన్నబాబు, టి.వెంకన్నబాబు, టి.ప్రసాద్,టి.రాజు తదితరులు పాల్గొని పుష్పగుచ్ఛం అందచేసి ఆమెను అభినందించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తుపాకుల రత్నం కృషి చేసి మహిళలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హక్కులను తెలియచేయాల్సిన బాధ్యత మానవహక్కుల సంఘానికి ఉందని అన్నారు.




విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY


# నగరాన్ని క్లీన్ సిటీగా చేసుకుందాం

## రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి పుష్కరాలనాటికి రాజమండ్రి నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దుతామని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. తిలక్ రోడ్డు లోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ఎంతో నష్టం జరుగుతుందని, అందుకే ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వినియోగాన్ని రాజమండ్రి నగరంలో పూర్తిగా నిషేధించాలని ఆయన కోరారు. ప్రజల సహకారంతోనే ఏదైనా సాధ్యమని అందుకే అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే రాజమండ్రి నగరాన్ని క్లీన్ సిటీగా చేసుకుందామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. ఇటీవల దైవ దర్శనానికి ఉజ్జయిని వెళ్ళానని, అక్కడ ఉజ్జయిని 7 సార్లు క్లీనెస్ట్ సిటీ అవార్డు పొందినట్లు ప్రకటనలు చూసి ఆశ్చర్యం కలిగిందని చెప్పారు. ఇది ఎలా సాధ్యమైందని స్థానిక ఎంపీని కలిసి అడగ్గా ప్రజలను చైతన్యపరిచి, వారి భాగస్వామ్యంతో ఇది సాధించినట్లు చెప్పారని తెలిపారు. ఎనిమిదో సారి కూడా తమకే ఆ క్లీన్ సిటీ అవార్డు వస్తుందని ఆ ఎంపీ ఎంతో నమ్మకంతో చెప్పారని, అందుకే ఉజ్జయిని మాదిరి రాజమండ్రి సిటీని కూడా క్లీన్ సిటీగా చేసుకుందామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రజల సహకారం కోరారు.అందరూ చేయిచేయి కలిపితే ఇది సాధ్యమవుతుందని ఆయన అన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా రాజమండ్రి నగరంలో ముంపు సమస్య నివారణకు రెండునెలల ముందు నుంచే కాలువల్లో పూడిక తీసే పనులు ముమ్మరంగా చేపట్టామని ఆయన తెలిపారు. ఏప్రిల్, మేనెలల్లో మేజర్, మైనర్ డ్రైన్లలో పూడిక తీయిస్తున్నామని,జేసీబీల ద్వారా మేజర్ డ్రైన్లలో పూడిక తీయడానికి టెండర్ల ద్వారా పనులు చేయిస్తున్నారని, అందుబాటులో ఉన్న పారిశుద్ధ్య కార్మికులతో మైనర్ డ్రైన్లలో పూడిక తీయిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వివరించారు. దీనివల్ల వర్షా కాలంలో ముంపు సమస్య చాలావరకు తగ్గుతుందని అన్నారు. కాలువల్లో పూడిక తీసే సమయంలో వేలాది ఖాళీ ప్లాస్టిక్ బాటిల్స్ బయటకు వస్తున్నాయని, దయచేసి ప్రజలు ఇలా ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో వేయవద్దని ఆయన కోరారు. అందుకే ప్లాస్టిక్ రహిత నగరంగా రాజమండ్రిని తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎక్కడ. కాలువల్లో పూడిక సమస్య ఉన్నా స్థానిక ప్రజలు తమకు తెలియచేయాలని కోరారు. ఒకప్పుడు సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండేవారు, ఇప్పుడు తనతో సహా కూటమి నాయకులంతా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. వైసీపీకి చెందిన మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు టీడీపీ వారిని వదిలిపెట్టేది లేదని, నరికేస్తామని ఇటీవల ఒక సమావేశంలో చేసిన వ్యాఖ్యలను ఒక విలేఖరి ప్రస్తావించగా దానికి స్పందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఇలాంటి ఉడత ఊపులకు టీడీపీ ఎప్పుడూ భయపడలేదు, ముందు కారుమూరి నాగేశ్వరరావును ఆగకుండా 100 మీటర్లు పరిగెట్టమని చెప్పండి, ఆతర్వాత ఇంకా ఓపిక ఉంటే అప్పుడు చూద్దాం అని వ్యాఖ్యానించారు. మీడియా సమావేశంలో టిడిపి నాయకులు వర్రే శ్రీనివాసరావు, నక్కా చిట్టిబాబు, నల్లం శ్రీను, మిస్కా జోగినాయుడు, బొర్రా చిన్ని, నేమాలి శ్రీను, లచ్చిరెడ్డి వాసు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పన్ను 15 శాతం పెంచడం దారుణం

## తక్షణం ఆ ప్రతిపాదన విరమించుకోవాలి.. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే డిమాండ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినట్లు నుంచి ప్రజలపై బాదుడే బాదుడు కార్యక్రమం అమలు చేస్తుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక మున్సిపల్ కాలనీలో ఉన్న డిసిసి కార్యాలయంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకేసారి 15 శాతం ఇంటి పన్ను పెంచడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన జీవో నే తమ అమలు చేస్తున్నామని కూటమి ప్రభుత్వం చెప్పడంపై ఆగ్రహం చేశారు. ఒకేసారి ఇంత పన్నులు పెంచితే సామాన్య మధ్యతరగతి ప్రజలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు ఏడాదికి ఐదు శాతం చొప్పున పెంచుకునేలా ప్రభుత్వం ప్రతిపాదించాలని కోరారు గత ముఖ్యమంత్రి జగన్ చెత్త పై పన్ను వేస్తే ప్రజలు ఆగ్రహించి ఆయనను ఇంటికి పంపారని గుర్తు చేశారు. చంద్రబాబు తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఇంటి పన్ను భారాన్ని తగ్గిస్తే ప్రజలు సంతోష పడతారని పేర్కొన్నారు జగన్ పాలనంత దోచుకో దాచుకో అన్నట్టుగా సాగిందని, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తొమ్మిది నెలల కాలంలో 17వేల కోట్లు కరెంట్ బిల్లుల రూపంలో దొడ్డిదారిన చార్జీలు పెంచి ప్రజల నుంచి కట్టించుకున్నారని మండిపడ్డారు. చంద్రబాబు సంపద సృష్టిస్తారని ప్రజలందరూ ఆశగా ఎదురు చూస్తుంటే ఈ విధంగా బాదుడే బాదుడు రూపంలో చార్జీలు పెంచుకుంటూ పోవడం దారుణమని వ్యాఖ్యానించారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే నిర్ణయాన్ని కూడా ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు తమ ఇంటికి స్మార్ట్ మీటర్లు సంవత్సరానికి వస్తే వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పిసిసి ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ మాట్లాడుతూ ఏఐసిసి కర్ణాటక నుంచి నలుగురు రాజ్యసభ సభ్యులను ఎంపిక చేయడానికి నిర్ణయం తీసుకుందని, ఆ జాబితాలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి పేరు కూడా చేర్చాలని కోరారు. ఆమె బాధ్యతలు చేపట్టినట్టు నుంచి కాంగ్రెస్ పార్టీని నిరంతరం బలోపేతం చేయడానికి చేస్తున్న కృషికి తగిన గుర్తింపు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వడయార్ మాట్లాడుతూ గతంలో జగన్, ఇప్పుడు చంద్రబాబు ఎవరు అధికారంలో ఉన్న రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇంటి పనులు కట్టలేక ప్రజలు ఇల్లు పొదిలి పారిపోయే పరిస్థితి వచ్చేలా కనిపిస్తోందని అన్నారు. అప్పుడే ప్రజలకు కూటమి ప్రభుత్వ పాలనపై వ్యతిరేకత వచ్చేసిందని వ్యాఖ్యానించారు. నరేంద్ర మోడీ మోడీ జెసి మూడోసారి ప్రధానమంత్రి అయ్యారని ఇక ప్రజలు ఆయనకు గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీని అధికారులకు తీసుకురావడం ఖాయం అన్నారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్లా షరీఫ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డి అందిస్తున్న సేవలను అధిష్టానం గుర్తించి రాజ్యసభకు ఎంపిక చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద, నియోజకవర్గాల కోఆర్డినేటర్లు తాడాల కొండరాజు, వై.శ్రీనివాస్, ఇతర నాయకులు బత్తిన చందర్రావు, దేవత సుధాకర్, కిషోర్ కుమార్ జైన్, పట్టాభి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


### సీతానగరం మండల టి.డి.పి.పార్టీ ఆర్గనైజర్ కందుకూరి నవీన్ ఆధ్వర్యంలో

# సి.ఎం చంద్ర బాబు జన్మదిన వేడుకలు



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కాటవరం గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ ఆర్గనైజర్ కందుకూరి నవీన్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబు నాయుడు 75 వ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు.తీన్మార్ డప్పుల శబ్దాలు,బాణాసంచా వెలుగులు, ప్రజల కేరింతల మధ్య చంద్రబాబుని తలచుకుంటూ ఆనందంతో కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. 50 మంది స్కూల్ పిల్లలకు చంద్రబాబు యొక్క ఫోటోతో కూడిన స్టీల్ వాటర్ బాటిల్స్ ను ఉచితంగా పంపిణీ చేసి చంద్రబాబుపై తనకున్న అభిమానాన్ని చాటిచెప్పారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిట్టూరి రంగారావు, కాద్రిగడ్డ సత్యనారాయణ, గూడపాటి శ్రీనివాస్ (బాబి),గొంతిన సత్యవతి,పోలిన ప్రకాష్ పాల్గొనగా వారితో మర్యాదపూర్వకంగా కేక్ కటింగ్ చేయించి బాటిల్స్ పంపిణీ చేయించారు. కందుకూరి నవీన్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అంటే తనకు ఊహ తెలిసినప్పటి నుండి చాలా ఇష్టమని ఆయన గొప్ప లీడర్ అని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి ఆయనతోనే సాధ్యమవుతుందన్నారు.

# ఏప్రిల్ 25న రాజమండ్రిలో కంచి యూనివర్సిటీ స్పాట్ అడ్మిషన్లు





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ విశ్వ విద్యాలయంగా దేశంలోనే అతి తక్కువ ఫీజులతో నడపబడుతున్న కంచి చంద్రశేఖర సరస్వతి విశ్వ మహా విద్యాలయం కంచి యూనివర్సిటీలో విద్యార్థులు చేరేందుకు సమగ్ర అవగాహన సదస్సు ఈ నెల 25న రాజమండ్రిలో స్వతంత్ర సమరయోధుల పార్కు భవనంలో లో నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర కేసరి యువజన సమితి తెలిపింది.సోమవారం నాడు సమరయోధుల పార్క్ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో సమితి ప్రతినిధులు పలు విషయాలను వివరించారు. కంచి యూనివర్సిటీ ఉపకులపతి డా.గుళ్ళపల్లి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్నారని తెలిపారు. బి ఈ, ఎంబీఏ, బీఈ హానర్స్ చెందిన 45 రకాల కోర్సులకు సంబంధించి ఈ అవగాహన సదస్సులో పలు వివరాలు విద్యార్థులు తల్లితండ్రులు తెలుసుకోవచ్చునని తెలిపారు.

# ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రజా నాయకుడు మేడా జన్మదిన వేడుకలు

## పార్టీ సెక్యులర్స్, ప్రముఖుల, శ్రేయభిలాషులు, సమక్షంలో పూల బోకులతో అందజేసి పలువురు శుభాకాంక్షలు

**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** అభిమానులు , శ్రేయోభిలాషులు , పార్టి సెక్యులర్స్ మధ్య రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు జరిగాయని అర్పిసి సీనియర్ సెక్యులర్స్ లంక దుర్గాప్రసాద్ ,బర్ల ప్రసాద్ సంయుక్తంగా తెలిపారు. నిరంతరం ప్రజా సమస్యలపై అలుపెరగని ప్రజా సేవకుడు గాను , బాధిత ప్రజలకు భరోసా గాను ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మేడా శ్రీనివాస్ మన ప్రజా స్వామ్యానికి ఒక వరం వంటి వారాని , అధికారంతో పని లేకుండానే అనేక సమస్యలకు తన మేధస్సుతో పరిష్కారం చూపుతున్న మా అధినేత మేడా శ్రీనివాస్ మాకు ఒక నమ్మకం , ఒక ధైర్యం అని , మా మహానేత మేడా ను చూస్తే మాకు ఎంతగానో గర్వకారణం అని , తన జీవితంలో ఒక శాసన సభ్యుడు, పార్లమెంట్ సభ్యుడు , ఒక మంత్రి సాధించలేని అనేక సమస్యలు సాధిస్తు ప్రజలకు మార్గదర్శకుడుగా నిలిచారాని , మేడా శ్రీనివాస్ నమ్మిన సిద్ధాంతం కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షల మంది యువతీ యువకులు మా అధినేతను అనుసరించటం మాకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని , ఏ విధమైన స్వార్థ ప్రయోజనాలకు తావు లేకుండా కుల మాతాలకు అతీతంగా మానవత్వంతో రాజకీయాల్లో ముందుకు సాగుతున్న మా మేడా శ్రీనివాస్ మాకు ఆదర్శ ప్రాయుడని , నేటి రాజకీయ సమాజంలో ఏ బలహీనత లేకుండా అనేక వేధింపులను తట్టుకుంటు బాధితులకు , అబాగ్యులకు , నిరాశ్రయులకు అండగా నిలుస్తున్న మా పోరాట యోధుడు , నేతాజీ వారసుడు మా మేడా శ్రీనివాస్ మాకు నిజమైన మార్గదర్శి , మా హీరో అంటు



మేడా శ్రీనివాస్ ను విచ్చేసిన వక్తలు పొగడ్తలతో ముంచేత్తారు. మహిళా సెక్యులర్స్ హృదయాల్లో తండ్రిగాను , అన్నగాను , పిల్లలకు మామయ్య గాను పిలుచుకునే మేడా ను చూస్తే అనేక గ్రామాల్లో వారు ధైర్యం గాను , భరోసా గాను , గర్వం గాను , ఉద్విగ్నం గాను ఒక నమ్మకంతో జీవిస్తారని , తన కోసం కన్నా సమాజం కోసం బ్రతకటం లోను , మరణించటం లోను ఒక తృప్తి, కిక్కు వుంటుందని అనేక సందర్భాల్లో మేడా శ్రీనివాస్ చెప్పే మాటలు ఒక బలమైన టానిక్ వలే వుంటుందని , నిజానికి ఎంతో ప్రశాంతమైన జీవితం మేడా శ్రీనివాస్ దని, అయినా బాధితులకు ఎదురయ్యే సమస్యలను తన సమస్యలుగా బావిస్తు వారికి వచ్చిన సమస్య లను తొలగించటం పైనే ఎక్కువగా దృష్టి సారిస్తుంటారని , అలాంటి గొప్ప మహానేత తో ప్రయాణం చేస్తున్నందుకు మేము ఎంతగానో అదృష్టవంతుల మని , ఏ బాధితుడైనా , ఏ సమస్యకైనా న్యాయం చేయగల ఏకైక దమ్మున్న నేత మా మేడా శ్రీనివాస్ అని చెప్పుకోవటంలో మాకు ఎంతో సంతృప్తి నిస్తుందని , అనేక ప్రజా ఉద్యమాల్లోను , పోరాటాలోను , నిజాయితీ లోను మేడా తో పోటి పండగల నేత లేరనటంలో సందేహం లేదని , అధికారం లో వున్న వారు సిగ్గు పడే విధంగా మేడా శ్రీనివాస్ అలుపెరగని పోరాటాలు సాగించటం మాకు ఎంతో గర్వకారణం అని , అదే పెద్ద మహోన్నత మైన విజయాలను మేడా చారిత్రిక ఖాతా నమోదైనవని , చట్ట సభల్లో బాంచన్ అంటు ప్రజా సమస్యలను వ్యాపారంగా మార్చుకునే కొంతమంది నేతలకు సాధ్యం కానిది మేడా చట్టంతో సాధిస్తున్న విజయాలను చూసి జ్ఞానోదయం పొందాలని , మేడా శ్రీనివాస్ లక్ష్యం తోనే సామాజిక భద్రత, అభివృద్ధి, సంపద సాధ్యం కావాలంటే మేడా ఆశయం గెలవాలని పలువురు వక్తలు మేడా ను , ఆయన లక్ష్యాన్ని , ఆయన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ముందుగా అభిమానులు మధ్య పుట్టినరోజు కేక్ ను మేడా శ్రీనివాస్ కట్ చేసారు . గజ మాలలు , పూల మాలలు, బుకేలతోను , బహుమతులు తోను మేడా శ్రీనివాస్ చిత్ర పటానికి పాలాభిషేకల తోను వారి అభిమానాన్ని చాటుకున్నారు . పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణి చేసారు . పెద్ద పెద్ద నినాదాలతో మేడా నాయకత్వానికి జే జేలు పలికారు . మేడా శ్రీనివాస్ కు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అర్పిసి సెక్యులర్స్ పెండ్యాల కామరాజు , కాసా రాజు ,డి వి రమణమూర్తి, సిమ్మా దుర్గారావు ,దుడ్డే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్, వాడపల్లి జ్యోతిష్ , ఆకుల మణికాంత్ ,కొల్లి సత్యనారాయణ ,గుడ్ల ప్రసాద్ , బసా సోనియా లతో పాటుగా నగర్ ప్రముఖులు కడియాల శ్రీనివాస్ , వాసంశెట్టి గంగాదరం,కిరణ్, సి టి ఆర్ ఐ బాచి , మురళి సత్తి సందీప్ , అరుణ్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మార్కిస్టు మహోపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్ జయంతి

## సీపీఐ (ఎం.ఎల్) పార్టీ ఆవిర్భావ ధీనోత్సవాన్ని జయప్రదం చేయండి : గోడపత్రిక అవిష్కరణ

## మార్క్సిజం -లెనినిజం-మావో ఆలోచన విధానం వర్ధిల్లాలి




**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** స్థానిక మహోభవన్ లో సిపిఐ (ఎం.ఎల్ )న్యూడెమోక్రసీ పార్టీ అద్వర్యం లో లెనిన్ జయంతిని పురస్కరించుకుని పోస్టర్లు ఆవిష్కరణ చేసారు. సి పి ఎల్ (ఎం ఎల్)న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు పి.టాన్య ,రాజమండ్రి నగర కమిటీ కార్యదర్శి కిరణ్‌కుమార్, మాట్లాడుతు కామ్రెడ్ లెనిన్ జయంతిని అందరు తప్పకుండ చెయ్యాలని 155 సంవత్సరాల క్రితం.. 1870, ఏప్రిల్ 22న రష్యాలోని సింబిర్స్క్ లెనిన్ జన్మించారు. ఆయన పూర్తిపేరు వ్లాదిమిర్ ఇల్విచ్ ఉల్యనోవ్ లెనిన్. ఆయన సంపన్న కుటుంబంలోనే జన్మించారు. ఆయన తండ్రి పాఠశాల అధికారిగా పనిచేశారు. లెనిన్ సోదరుడు జార్ చక్రవర్తిపై హత్యాయత్నం చేశాడన్న నేరం మోపి, ఆయనకు 1887లోనే ఉరిశిక్ష విధించారు. లెనిన్ కూడా నిరంకుశ రాచరిక జార్ చక్రవర్తి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటంలో పాల్గొనడం వల్ల 1897లో కజన్ విశ్వవిద్యాలయం నుంచి ఆయన్ను బహిష్కరించి, సైబీరియాకి పంపించి వేశారు. ఆనాడు లెనిన్ యువతరం కలల నాయకుడిగా నిలిచారు.ఆయన మొదట్లో రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఆ తర్వాత బోల్షివిక్ గ్రూప్నకు వ్యవస్థాపక నాయకుడయ్యారు. ఆ తర్వాత లెనిన్ అందించిన నాయకత్వం వల్ల ఆయన అవలంబించిన విప్లవ ఎత్తుగడ వల్ల 1917లో జార్ చక్రవర్తి ప్రభుత్వం కూలిపోయింది. ఆ తర్వాత ఆవిర్భవించిన సోవియట్ యూనియన్ సోషలిస్టు రిపబ్లిక్కు చైర్మన్గా ఎన్నికై, 1924లో తుది శ్వాస విడిచేవరకు కొనసాగారు. ఆయన నాయకత్వం, ఆయన రచనలు, విప్లవోద్యమాన్ని విజయపథంలో నడిపించిన ఆయన సారథ్యం ఆనాడు యావత్ ప్రపంచ గమనాన్నే మార్చేందుకు దోహదపడ్డాయి.బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ఉరికొయ్యలను ముద్దాడిన భగత్సింగ్ కూడా లెనిన్ తాత్విక భావాల పట్ల ఆకర్షితులయ్యారు. భగత్సంగ్కి ఉరిశిక్షను అమలు చేసే ముందు జైలు అధికారులు చివరి కోరిక ఏమిటని అడగ్గా "నేను లెనిన్ జీవిత చరిత్రను చదువుతున్నాను. అది పూర్తిచేయాలనేదే నా కోరిక" అని భగత్ సింగ్ చెప్పిన మాటలు ఆనాటి నుంచి నేటి వరకు యువతరం గుండెల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఎన్ని తరాలు మారినా, మరెన్ని వక్ర భాష్యాలు, సిద్ధాంతాలు ఉద్భవించినా ప్రపంచగమనాన్ని మార్చిన వ్యక్తులను ఎవ్వరూ విస్మరించలేరు. మానవజాతి మనుగడ కొనసాగినంత వరకూ, దోపిడీ, పీడనలు తొలగిపోయి, ఎటువంటి వివక్షకూ తావులేని సమసమాజం ఆవిష్కృతం అయ్యేవరకు లెనిన్ అనే మూడక్షరాలు యావత్ సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయి.నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను పథకాల పెరుతో మభ్యపెడుతున్నా యని దున్నేవానికే భూమి దక్కాలని నూతనప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలని సీపీఐ (ఎం.ఎల్ )పార్టీ ఆవిర్భావ ధీనోత్సవాన్ని జిల్లా అన్నీ ప్రాంతల్లో (సుత్తి కొడవలి )ఎర్ర జండా ఎగురవెయ్యాలని ,సదస్సులు ర్యాలీ లు విస్తృతం గా తీయాలనిమార్క్సిజం లేనినిజం మావోలోచన వెలుగులో పని చెయ్యాలని ఆధునిక సరికొత్త రివిజినిజానికి వ్యతిరేకంగా పోరాడాలని,పార్టీ శ్రేణులకు, ముఖ్య నాయకత్వానికి, కేడర్ కు, ప్రజలకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు కె.భాను ప్రసాద్, పట్టణ కార్యదర్శి దినేష్, ఐఎఫ్‌టియు నాయకులు సూరిబాబు, రవణ ,సతీష్ , రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు చెల్లించాలి



**తాళ్లరేవు, విశ్వంవాయిస్ న్యూస్**
ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించి, ముమ్మరంగా ఉపాధి పనులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాం డ్ చేశారు. ఆదివారం మండ లంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలు చేసిన పనులకు వేతనాలు రాలేదన్నారు. చట్టప్రకారం 15 రోజులకే వేతనాలు ఇవ్వాల్సివుందన్నారు. నెలల తరబడి వేతనాలు రాకపోవడం చాలా విచారకరమన్నారు. రెక్క ఆడితేనే కానీ డొక్కాడని కూలీలు నెలల తరబడి వేతనాలు రాకపోతే వారు ఏమి తిని బ్రతుకుతారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కూలీలకు కల్పించవలసిన సదుపాయాలు, మెడికల్ కిట్లు, పరికరాలు, మేట్స్‌కి పారితోషకాలు ఇవ్వడం లేదని, చట్టంలో ఇవన్నీ ఇవ్వాలని ఉన్న అమలు చేయడం లేదని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ పెంచకపోగా ప్రభుత్వం చెబుతున్న కనీసం రూ.300 వేతనం ఇవ్వకపోవడం చాలా దుర్మార్గమని అన్నారు. శ్రమజీవులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర వ్యాప్తంగా కూలీలకు రావలసిన బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో నాయకులు దుప్పి అదృష్టదీపుడు, విశ్వజన కళా మండలి రాష్ట్ర నాయకుడు వడ్డి ఏడుకొండలు పాల్గొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం




**కాకినాడ, విశ్వంవాయిస్ న్యూస్** : కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ లౌకిక స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.చిష్తి అన్నారు. స్థానిక యుటిఎఫ్ హోంలో రఘుపతి వెంకట రత్నం నాయు డు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 'వక్ఫ్ సవరణ చట్టం పర్యవసానాలు' అనే అంశంపై సదస్సు జరిగింది. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కెఎంఎంఆర్.ప్రసాద్ అధ్యక్షత జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా ఒక పథకం ప్రకారం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ వస్తుందన్నారు. పేద ముస్లింల మేలు కొరకు ఈ చట్టాన్ని సవరించామని ప్రగల్భాలు పలుకుతున్న బిజెపి నాయకులు సచార్ కమిటీ సిఫార్సులను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. వక్ఫ్ అర్థాన్నే మార్చేసేలా తాజా సవరణలు ఉన్నాయని, వక్ఫ్ ఆస్తులను కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర ఇందులో దాగి ఉందని ప్రజలు గమనించాలని సూచించారు. మత విశ్వాసాలను బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తుందని, అదే సమయంలో దేశ సంపదను కార్పొరేట్‌లకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. మానవతా వాదులంతా వక్ఫ్ సవరణ చట్టం గురించి ఆలోచించాలని, దేశ లౌకిక పునాదుల రక్షణకు నిలబడాలని పిలుపు ఇచ్చారు. ప్రముఖ న్యాయవాది మహ్మద్ జవహర్ అలీ మాట్లాడుతూ వక్ఫ్ చట్టం అనుసరించి దేశంలో కౌన్సిల్, రాష్ట్రాలన స్థాయిలో 32 బోర్డులు ఉన్నాయన్నారు. తాజాగా తీసుకొచ్చిన చట్టం వల్ల వక్ఫ్ స్వతంత్ర ప్రతిపత్తి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వే కమిషనర్ స్థానంలో కలెక్టర్‌ను నియమించడం, ముస్లిమేతరులు బోర్డులో ఉండాలనడం, దానం ఇచ్చేవారు కనీసం 5 సంవ త్సరాలు ముస్లింగా ఉండాలనడం వంటి రకరకాల మార్పులు వక్ఫ్ ఆస్తుల రక్షణను ప్రశ్నార్థకం చేస్తా యన్నారు. వక్ఫ్ ఆస్తుల రక్షణతో పాటు రాజ్యాంగ రక్షణకు భారతీయులంతా కలిసి రావాలన్నారు. కొండలరావు ఆలపించిన గీతాలు, జివిఎస్.వర్మ ఆలపించిన హిందీ కవిత ఆలోచింప చేశాయి. ఈ కార్యక్రమంలో కె.నాగజ్యోతి, సిహెచ్‌వి.రమణ, స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవిందరాజులు, ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన పల్లెకోన వంతెన



**భట్టిప్రోలు, విశ్వంవాయిస్ న్యూస్** : బ్రిటీష్ కాలంలో భట్టిప్రోలు మెయిన్ డ్రైన్‌పై పల్లెకోన గ్రామ వద్ద నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. 20ఏళ్ల క్రితమే ఈ వంతెన పిల్లర్లు పగుళ్లు ఇచ్చాయి. అప్పటి నుండి అధికారులు ఈ వంతెన పట్ల నిర్లక్ష్యం వహిస్తూ వస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డెల్టా ఆధునికరణ కోసం నిధులు వెచ్చించి వంతెనలు, మురుగు కాలువల అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ సమయంలోనే పల్లెకోన వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన నిర్మిస్తారని ప్రజలు భావించారు. అధికారులు వంతెన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. కానీ ఆ పని కార్యరూపం దాల్చలేదు. అప్పటి నుండి ప్రయాణికులు, వాహనదారులు బిక్కు బిక్కుమంటూ ఈ వంతెనపైనే ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇటీవల ఈ వంతెన కొంత భాగం విరిగి కింద పడిపోవటంతో పోలీసులు అధికారులు పగిలిన ప్రాంతంలో భారికేట్లు ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డు అమర్చారు. రేపల్లె నుండి భట్టిప్రోలు వరకు ప్రధాన రహదారి మార్గంలో ఉన్న ఈ వంతెనపై నిరంతరం బాపట్ల, గుంటూరు, చీరాల, విజయవాడ, తెనాలి వంటి ప్రాంతాలకు రేపల్లె నుండి ఆర్టీసీ బస్సులు, లారీలు, ఆటోలు ప్రయాణిస్తూ ఉంటాయి. పల్లెకోన, రాచూరు, ఆలముడి వంటి గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన భట్టిప్రోలు రావడానికి ఇదే ప్రధాన మార్గం. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ వంతెనను తాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ప్రమాదం జరగక ముందే నూతన వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

## అగ్ని ప్రమాదాలపట్ల అవగాహన



**బాపట్ల, విశ్వంవాయిస్ న్యూస్**
అగ్ని ప్రమాదం చిన్నదని అశ్రద్ధ చేయొద్దని, అదే పెద్ద నష్టానికి దారితీస్తుందని అగ్నిమాపక అధికారి వై వెంకటేశ్వర్లు అన్నా రు. అగ్ని ప్రమాదాల వారోత్సవ ముగింపు సందర్భంగా అగ్నిమా పక కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. అనుకోని రీతిలో జరిగే అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పట్టణంలోని జేమ్స్ హై స్కూల్ విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక పరికరాల పనితీరును విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జేమ్స్ హై స్కూల్ డైరెక్టర్ ఆదెళ్ళ విజయకుమార్, అగ్నిమాపక సిబ్బంది మునాఫ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

# సాంఘిక బహిష్కరణపై శాంతి కమిటి



**పిఠాపురం, విశ్వంవాయిస్ న్యూస్**
మండలలోని మల్లం గ్రామంలో దళితులపై గ్రామ పెత్తందారులు సాంఘిక బహిష్కరణ నేపథ్యంలో ఇరు సామాజిక వర్గాలకు చెందిన ప్రతినిధులతో అధికార యంత్రాంగం శాంతికమిటిని ఏర్పాటు చేసింది. ఆదివారం తహశీల్దార్ కార్యాలయంలో అధికార యంత్రాంగం సమావేశం ఏర్పాటు చేసింది. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, తహశీల్దార్ గోపాలకృష్ణ, సిఐ జి.శ్రీనివాస్, పెద్దాపురం ఎస్‌డబ్ల్యూఒ వై.వాణి ఆధ్వర్యంలో ఇరు వర్గాల ప్రతినిధులతో చెరో ఆరుగురు ప్రతినిధులతో శాంతి కమిటీని ఏర్పాటు చేశారు. మల్లం గ్రామంలో ఇటీవల జరిగిన సంఘటనకు సంబంధించి పల్లపు సురేష్‌బాబు అనే వ్యక్తి ఈ నెల 16వ తేదీన ఎలిసెట్టి జల్లిబాబు ఇంట్లో ఎలక్ట్రికల్ మరమ్మతులు చేస్తూ దురదృష్టవశాత్తు మృతి చెందారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఎస్‌సి నాయకులు రూ.10 లక్షల పరిహారం డిమాండ్ చేయగా, జల్లిబాబు ఆర్థికంగా బలహీనంగా ఉండటంతో, స్థానిక సిఐ సమక్షంలో రూ.2.75 లక్షల పరిహారంపై పరిష్కారం కుదిరిందని, ఈ పరిణామాల నేపథ్యంలో మల్లం గ్రామానికి చెందిన ఒక సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు గతంలో జరిగిన ఇటువంటి ఘటనలను గుర్తు చేసు కుంటూ, వాదనలు మొదలుపెట్టారు. వీరి అసంతృప్తి కారణంగా ఎస్‌సి కుటుంబాలపై సామాజిక బహిష్కరణ చర్యలు ప్రారంభమయ్యా యి. ఆదివారం ఉదయం ఒక ఎస్‌సి కుటుంబానికి గ్రామ పెత్తందారి వర్గానికి చెందిన చికెన్ వ్యాపారి చికెన్ విక్రయించడాన్ని నిరాకరించారు. అంతేకాకుండా, పొలాల్లో, షాపుల్లో ఎస్‌సి కుటుంబాల సేవలను నిలిపివేశారు. ఈ సంఘటనలపై గ్రామానికి చెందిన కొంతమంది ఎస్‌సి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో హుటాహుటీన ఆర్‌డిఒ, వికాస పీడీ గ్రామానికి చేరుకున్నారు. వీరిద్దరూ గ్రామంలోనే ఉండి, నిరంతరం పరిస్థితిని పర్య వేక్షించారు. దళితులతో మాట్లాడిన అధికారులు స్థానిక పంచాయతీలో గ్రామ పెత్తందారీ వర్గానికి చెందిన ప్రతినిధులతో చర్చలు నిర్వహిం చారు. అనంతరం ఇరు సామాజికవర్గాలకు చెందిన ప్రతినిధిలతో తహశీల్దార్ కార్యాలయంలో చర్చించి శాంతి కమిటీని ఏర్పాటు చేశారు. కుల వివక్షత పోరాట కమిటీ(కెవిపిఎస్) జిల్లా కార్యదర్శి కె.సింహాచలం గ్రామానికి చేరుకున్నారు. జరిగిన ఉదంతానికి గల కారణాలను ఎస్‌సిలతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌డిఒను కలిసి దళితులపై ఇటువంటి చర్యలకు పాల్పడటం దారుణమని వివరించారు. ఉద్రిక్తతలకు తావులేకుండా చర్యలు: కలెక్టర్మల్లం గ్రామంలో ఇటీవల జరిగిన సంఘటనకు సంబంధించి, ప్రస్తుతం పరిస్థితి నియంత్రణలో ఉందనీ, శాంతి కమిటీ ఏర్పాటు చేసి, అన్ని వర్గాల మధ్య సౌహార్దాన్ని నెలకొల్పే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి ఉద్రిక్తతలు ఏర్పడకుండా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. దళితుల సాంఘిక బహిష్కరణ దారుణంమండలంలోని మల్లం గ్రామంలో దళితులపై వివక్షత, సాంఘిక బహిష్కరణ చర్య దారుణమని సిపిఎం మండల కన్వీనర్ కుంచే చిన్న ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు.

# వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధం




**-షాదీ ఖానాలో ముస్లిం పెద్దలు రౌండ్ టేబుల్ సమావేశం**
**-ఈ నెల 25న పెద్ద ఎత్తున నిరసన పిలుపు**
**-సమావేశంలో సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు**

**చీరాల, విశ్వంవాయిస్ న్యూస్**
వక్ఫ్ చట్ట సరవణ రాజ్యాంగ విరుద్ధమని, మైనార్టీల హక్కులపై దాడి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు కోరారు. స్థానిక ముస్లిం షాది ఖానా ఆవరణలో జమాయత్ ఉలమ ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వక్ఫ్ బోర్డ్ అమెండ్మెంట్ బిల్లును వ్యతిరేకిస్తూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లిం మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం మీడియాతో ముస్లిం సంఘాల పెద్దలు మాట్లాడారు. వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించారు. వక్ఫ్ చట్ట సవరణ ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే కాకుండా మైనారిటీల మతపరమైన హక్కులకు ముప్పు కలిగిస్తుందని పలువురు ముస్లింలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 25న శుక్రవారం జామియత్ ఉలమా ముస్లిం సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపడుతున్నట్లు ప్రకటించారు. ముస్లిం సంఘాల పెద్దలు మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వమని ప్రపంచానికి చాటిన ప్రజల మధ్య మతోన్మాద పార్టీలు చిచ్చు పెట్టాలని చూస్తున్నాయని ఆరోపించారు. మైనారిటీల హక్కులకు దీర్ఘకాలిక ముప్పు తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు చోటుకల్పించడం వల్ల ముస్లిముల మాటకు విలువ ఏముంటుందని ప్రశ్నించారు. దీని ప్రభావం కేవలం మైనార్టీలపైనే కాదని, భవిష్యత్తులో హిందువులు, క్రైస్తవులపై కూడా పడుతుందని అన్నారు. వేటపాలెం, ఈపురుపాలెం, కొత్తపేట, గంజిపాలెం, చీరాల పరిధిలోని మసీదులకు చెందిన పెద్దలందరూ భారీగా నిరసన శాంతి ర్యాలీ చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ రెహమాన్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి షేక్ హుమయున్ కబీర్, షేక్ అల్లాబక్షు, సౌకత్ ఆలీ, ముక్తి మహమ్మద్ షఫీ, హబీబుల్లాసాహెబ్, అబ్దుల్ సలీం, కొత్తపేట షేక్ అల్లాబక్షు, షేక్ కమ్రుద్దీన్ పాల్గొన్నారు.

## కూరగాయల వ్యాపారుల సిండికేట్



**మార్కాపురం, విశ్వంవాయిస్ న్యూస్**
మార్కాపురంలో కూరగాయల వ్యాపారుల సిండికేట్ ప్రజలకు శాపంగా మారింది. సిండికేట్‌గా మారి వేలంపాట నిర్వహించిన ప్రతి విడతలోనూ కూరగాయల ధరలు నింగినంటుతున్నాయి. కూరగాయలు నిత్యావసరాలు కావడంతో అధిక ధరలకు కొనుగోలు చేయక తప్పడం లేదు.! మార్కాపురంలో శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మో త్సవాల్లో ప్రతి ఏడాది సాంస్కృతి క కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ప్రధాన రాజకీయ పార్టీల తరపున కార్యక్రమాలు జరుగుతుంటా యి. అందులో భాగంగా ప్రధాన రాజకీయ పార్టీల నేతలు కూరగా యల మార్కెట్ అసోసియేషన్‌ను విరాళం నిమిత్తం కలుస్తుం టారు. ఈ చందా చెల్లించేందుకు వ్యాపారులంతా సిండికేట్‌గా మారుతారు. మార్కెట్‌లో వ్యాపారులంతా కలిసి వేలం పాట నిర్వహిస్తారు. అందులో ఒక్కరే పాటలో నెగ్గుతారు. హెచ్చు పాటదారుడు మాత్రమే కూరగాయలు అమ్ముకోవాలి. తాజాగా రూ.2,15,000/- పాటతో ఓ వ్యాపారి కూరగాయల అమ్మకాన్ని దక్కించుకున్నాడు. మూడు రోజుల పాటు ఈ పాటదారుడు అమ్ముకునేలా తీర్మానించారు. మార్కాపురం పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు మార్కెట్ ఒక్కటే కావడం అందులోనూ ఒక్కరే అమ్మకం చేపట్టాల్సి ఉండటంతో కూరగాయల ధరలు పెంచుకుంటారు.

## ఉపాధ్యాయుల కేటాయింపు అసంబద్ధం



**బాపట్ల, విశ్వంవాయిస్ న్యూస్**
ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ఉపాధ్యాయుల కేటాయింపు అ సంబద్ధం, గందరగోళంగా ఉం దని ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధా న కార్యదర్శులు బడుగు శ్రీని వాస్, గుడివాడ అమరనాథ్ ఆరో పించారు. విలేకరులతో ఆది వారం మాట్లాడారు. ప్రతి గ్రా మంలో ఒక పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్పు చేసి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యా యుడు చొప్పున 5 గురు ఉపాధ్యాయులను కేటాయిస్తామని పత్రికల్లో ఊదరగొట్టిన విద్యా శాఖ అధికారులు ఇప్పుడు 60 మంది దాటితేనే 5 గురు ఉపాధ్యాయులను కేటాయిస్తామని మాట మార్చడం ప్రాథమిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయటమేనని అన్నారు. విద్యా వ్యవస్థలో ప్రాథమిక పాఠశాలలు పునాది వంటివని అన్నారు. వాటిని బలహీన పర్చడం అంటే బలహీనమైన పునాదిపై భవనం కట్టడం వంటిదేనని అన్నారు. ఇది విద్యా వ్యవస్థకు పెను ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. రోల్‌తో సంబంధం లేకుండా ప్రతి గ్రామంలో ఒక ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చాలని అన్నారు. ప్రాథమిక పాఠశాలలకు ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి వేరువేరుగా ఉండడం ఆర్‌టిఈ చట్టానికి విరుద్ధం అన్నారు. ఫౌండేషన్ పాఠశాలకు 1:30, బేసిక్ ప్రాథమిక పాఠశాలకు 1:20, హై స్కూలులో ఉన్న ప్రాథమిక పాఠశాలకు 1:10 ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి అనేది ప్రాథమిక పాఠశాలలపై వివక్ష చూపడమేనని అన్నారు. అన్ని రకాల ప్రాథమిక పాఠశాలలకు ఒకే టిపిఆర్ ఉండాలని కోరారు.




## అందచందాలతో పిచ్చెక్కిస్తున్న అషికా

సినీ వాయిస్ CINEMA


# రెమ్యునరేషన్‌లో రాజమౌళిని కొట్టింది అతనొక్కడే..

ఇండియన్ సినిమా స్థాయిని ప్రపంచానికి పరిచయం చేసిన దర్శకధీరుడు రాజమౌళి.. ఇప్పుడు మరోసారి టాప్ ర్యాంకును సాధించాడు. ఆయన సినిమాలు మాత్రమే కాదు.. ఆయన రెమ్యునరేషన్ కూడా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. తన ప్రతి సినిమాతో బాక్సాఫీస్ ని వణికించే రాజమౌళి.. ఇప్పుడు రెమ్యునరేషన్ పరంగా ఇండియాలోనే నెంబర్ వన్ డైరెక్టర్ గా నిలిచాడు. ఈ విషయాన్ని తాజాగా ప్రముఖ సినీ డేటాబేస్ వెబ్‌సైట్ IMDB వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. ఇండియాలో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకుంటున్న దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళే అని స్పష్టం చేసింది. ఆయన ఒక సినిమా కోసం తీసుకునే రెమ్యునరేషన్ రూ.200 కోట్లు అని పేర్కొంది. ఇది రెమ్యునరేషన్, లాభాల్లో షేర్ రూపంలో కలిపి వచ్చిన మొత్తం అని వివరణ ఇచ్చారు. ఇక మహేష్ బాబు సినిమాకు అంతకంటే ఎక్కువ కూడా రావచ్చు. టాప్ స్టార్ హీరోలకన్నా ఎక్కువగా రాజమౌళి తీసుకుంటున్నాడంటే, అది ఆయన క్రేజ్‌కు నిదర్శనం. ఇక వరుసగా హిట్ మీద



హిట్ కొడుతున్న ఆయన ప్రతిష్ఠ ప్రపంచ స్థాయిలో ఉండటంతో.. ఈ స్థాయి రెమ్యునరేషన్ తీసుకోవడం సహజమే అని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అయితే.. రాజమౌళికి ఈ స్థాయిలో పోటీ ఇచ్చిన డైరెక్టర్ ఎవరో తెలుసా? అతను మరెవరో కాదు.. మన టాలీవుడ్ దర్శకుడు సుకుమార్. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో తెరకెక్కించిన పుష్ప 2 సినిమాతో భారీ రెమ్యునరేషన్ పొందినట్లు సమాచారం. పుష్ప 2 ప్రపంచవ్యాప్తంగా రూ.1800 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించిందని అంచనా. దీంతో సుకుమార్‌కి రెమ్యునరేషన్‌తో పాటు లాభాల్లో భాగస్వామ్యంగా దాదాపు రూ.200 కోట్ల వరకు ఆదాయం వచ్చినట్టు తెలుస్తోంది. అంటే గణాంకాల పరంగా చూస్తే.. రాజమౌళి కంటే ముందే 200 కోట్ల రెమ్యునరేషన్ మార్క్‌కి సుకుమార్ చేరుకున్నాడని చెప్పవచ్చు. ఇక IMDB నివేదిక ప్రకారం రాజమౌళికి తర్వాత రెమ్యునరేషన్ తీసుకుంటున్న దర్శకుల్లో ప్రశాంత్ నీల్, సందీప్ రెడ్డి వంగా ఒకొక్కరు రూ.90 కోట్ల వరకూ తీసుకుంటున్నారు. ఇక రాజ్ కుమార్ హిరానీ రేటు రూ.80 కోట్ల దాకా ఉందని నివేదిక స్పష్టం చేసింది. అయితే ప్రస్తుతం పుష్ప 2 సక్సెస్ ద్వారా సుకుమార్ మార్కెట్ మరోలెవెల్‌కి వెళ్లింది. దీంతో తన తదుపరి సినిమా కోసం రామ్ చరణ్‌తో కలిసిపనిచేస్తున్న సుక్కు.. ఈసారి మరింత భారీగా స్కేల్ ప్లాన్ చేస్తున్నాడు. ఈ క్రేజీ కాంబినేషన్‌పై ఇప్పటికే ఫ్యాన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. పుష్ప 2తో సాధించిన వసూళ్ల స్థాయిని దాటి, కొత్త మార్కెట్లను టార్గెట్ చేస్తూ సుకుమార్ పాన్ వరల్డ్ సినిమా ప్లాన్ చేస్తున్నట్టు టాక్. ఇది జరిగితే.. ఆయన తీసుకునే రెమ్యునరేషన్ మరింతగా పెరగొచ్చు.

# పుష్ప రాజ్‌ని టార్గెట్ చేసిన ఏ.ఐ.ఎస్.ఎఫ్..!




ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఏ.ఐ.ఎస్.ఎఫ్ పుష్ప హీరో అల్లు అర్జున్ హీరోయిన్ శ్రీలీల మీద క్రిమినల్ కేసు పెట్టాలని విజయవాడకి చెందిన సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. అల్లు అర్జున్, శ్రీలీల కార్పొరేట్ కాలేజ్ లకు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉంటూ తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నారని ఏ.ఐ.ఎస్.ఎఫ్ సభ్యులు చెప్పుకొచ్చారు. జే.ఈ.ఈ మెయిన్ లో టాప్ ర్యాంకర్ల ఫోటోలను వేరువేరు కాలేజీలు వేశారని వెల్లడించారు. ఒకే స్టూడెంట్ పేరుని రెండు కాలేజీలు వేస్తున్నారని అలాంటి వాటి వల్ల స్టూడెంట్స్ జీవితాలు నాశనం అవుతున్నాయని అన్నారు. దీనికి కారణమైన ఇలాంటి కాలేజీలకు బ్రాండ్ అంబాసిడర్స్ గా ఉంటున్న వారిని కూడా వదలకూడదని అంటున్నారు. ఈ క్రమంలో అల్లు అర్జున్, శ్రీలీల ఇద్దరి మీద క్రిమినల్ కేసు పెట్టాలని ఏ.ఐ.ఎస్.ఎఫ్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. స్టార్ హీరోగా అల్లు అర్జున్ క్రేజ్ ని వాడుకునేందుకు కొన్ని కాలేజీలు అతనితో బ్రాండింగ్ చేయిస్తున్నారు. ఐతే జే.ఈ.ఈ మెయిన్ ర్యాంకుల్లో ఒకే విద్యార్థి పేరుని వేర్వేరు కాలేజీలు వేయడం ఏంటంటూ ఏ.ఐ.ఎస్.ఎఫ్ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఐతే దీనికి సంబంధం ఉన్నా లేకపోయినా సరే ఇలాంటి కాలేజీలకు బ్రాండ్ అంబాసిడర్ గా ఉంటూ స్టూడెంట్స్ ని మిస్ గైడ్ చేస్తున్నట్టుగా భావించి అల్లు అర్జున్, శ్రీలీల మీద క్రిమినల్ కేసు పెట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఐతే పుష్ప 2 తో బ్లాక్ బస్టర్ అందుకున్న అల్లు అర్జున్ ఈమధ్య ఏం చేసినా పెద్దగా కలిసి రావట్లేదు. ముఖ్యంగా పుష్ప 2 ప్రీమియర్ షో టైం లో జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ ప్రాణం పోగా ఒక బాబు కూడా హాస్పిటల్ పాలయ్యాడు. ఆ టైం నుంచి అల్లు అర్జున్ మిగతా విషయాల్లో కూడా జాగ్రత్త వహిస్తున్నాడు. ఐతే ఊహించని విధంగా ఏ.ఐ.ఎస్.ఎఫ్ విజయవాడ నుంచి క్రిమినల్ కేసు వేయాలని డిమాండ్ రావడం తో బన్నీ కాంపౌండ్ ఒకింత షాక్ కి గురైంది. పుష్ప 2 తర్వాత అల్లు అర్జున్ అట్లీతో సినిమా లాక్ చేసుకున్నాడు. ఆ సినిమాకు సంబంధించిన ఒక అనౌన్స్ మెంట్ వీడియో ఈమధ్యనే రిలీజైంది. సన్ పిక్చర్స్ బ్యానర్ లో వస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్ తో నిర్మించబోతున్నారని తెలుస్తుంది.



# రాశీఖన్నా రెడ్ బికినీ కిరాక్


బికినీలు, స్విమ్ సూట్లలో చెలరేగిపోవడం రాశీకి కొత్తేమీ కాదు కానీ, ఈసారి మరింత హాలి గా ప్రత్యక్షమై అందరికీ షాకిచ్చింది. అది కూడా హిల్ టాప్ రిసార్ట్స్ లోని హై ఎండ్ వ్యూలో స్మిమ్మింగ్ పూల్‌లో రెడ్ హాలి బికినీలో రాశీ ఫోజులు కుర్రకారు గుండెల్లో గుబులు రేకెత్తిస్తున్నాయి. రాశీ తాజా బికినీ షూట్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. ఈ పోస్ట్ కి వెంటనే స్పందించింది ఎవరో తెలుసా? లక్ష్మీ మంచు, ప్రగ్య జైశ్వాల్, రెజీనా .. వీళ్లెవరూ కాదు. రాశీ ఖన్నా ఇండస్ట్రీ స్నేహితుల్లో తనకు దగ్గర బంధువే అయిన వాణీ కపూర్ స్పందించింది. వాణీ వెంటనే హాలి అని ఈ పోస్ట్ కి వ్యాఖ్యను జోడించింది. తప్పిపోయాను ..ఇతరులు నన్ను కనుక్కోవాలని లేదు! అని రాశీ ఈ పోస్ట్ కి క్యాప్షన్ ఇచ్చింది. తనను ఎవరైనా కనిపెట్టి తిరిగి జనారణ్యంలోకి తీసుకుని వెళితే అక్కడ మళ్లీ మొదలయ్యే కష్టాల గురించి కలత చెందుతున్నట్టే కనిపిస్తోంది. నిరంతర పని ఒత్తిళ్ల నుంచి దూరంగా, సుదూర తీరంలోని రిసార్ట్ కి వెళ్లిన రాశీకి తిరిగి రావాలని లేదు!. అందుకే తనను ఎవరూ కనుగొనవద్దని చెబుతోంది. రాశీ నటించిన తెలుసు కదా చిత్రం మేలో విడుదల కానుంది.

# సముద్రంతో నీల్ 'డ్రాగన్'!



కెజీఎఫ్, సలార్ లాంటి మాస్ మాసివ్ యాక్షన్ ఫిల్మ్స్ తర్వాత ప్రశాంత్ నీల్ ఇప్పుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్‌తో కలిసి రూపొందిస్తున్న 'డ్రాగన్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రీసెంట్‌గా విడుదల చేసిన ఓ ఫొటో ఈ అంచనాలను మరింత పెంచేసింది. సముద్ర తీరంలో ప్రశాంత్ నీల్-ఎన్టీఆర్ చర్చిస్తున్న స్టిల్ ఒకటే సోషల్ మీడియాలో వైరల్ అయిపోయింది. ఇక ఆ ఫొటో వెనుక ఉన్న మూడ్, మిస్టరీ... అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఫ్యాన్స్ మాత్రం ఇది ఓ కీలక యాక్షన్ సీన్ కంటే ముందు ప్లానింగ్ కావచ్చని చెబుతున్నారు. నీల్ సినిమాల్లో సముద్రానికి ప్రత్యేక స్థానం ఉంటుంది. సముద్రం అంటే డైరెక్టర్ నీల్ కు చాలా ఫాంటసీ అని కెజీఎఫ్, లోనే చూపించాడు.. హీరో ఎలివేషన్స్ ను అందులో సముద్రంతో పోల్చడం బాగా హైలెట్ అయ్యింది.అంటే సముద్రాన్ని కేవలం బ్యాక్ డ్రాప్‌గానే కాకుండా, కథలో కీలక అంశంగా చూపించే ఛాన్స్ ఉంది. కెజీఎఫ్, కంటే డేంజరస్ ఎలివేషన్స్ ఇచ్చేలా ఉన్నట్లు అర్థమవుతుంది. కథలో వాస్తవతను మిక్స్ చేస్తూ విజువల్‌గా విభిన్న అనుభూతిని అందించడంలో ఆయనకు సాటి లేరు. ఇక ఎన్టీఆర్ హీరోగా నటిస్తుండటం.. ఆయన యాక్షన్ ప్రెజెన్స్.. ఎమోషనల్ డెప్త్ కలిగిన కథతో మిక్స్ చేస్తే.. డ్రాగన్ భారీ స్థాయిలో పేలే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్నాయి. మ్యూజిక్‌కు కెజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ పని చేస్తున్నారు. ఈ సినిమా 2026 సమ్మర్‌లో పాన్ ఇండియా విడుదల కానుంది. ఇందులో రుక్మిణి వసంత కథానాయికగా నటించనుండగా, తెలుగు సినిమా చరిత్రలో మరిచిపోలేని యాక్షన్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలనే ఆలోచనతో టీమ్ పని చేస్తోంది.

# రామ్ తో భాగ్యశ్రీ.. రింగ్ కామెంట్ తో క్లారిటీ!



టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే రిలేషన్ లో ఉన్నట్టు కొద్ది రోజులుగా రూమర్స్ చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం వీరిద్దరూ ఓ మూవీ చేస్తున్నారు. ఆ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఇద్దరూ.. తమ సోషల్ మీడియా అకౌంట్స్ లో వేర్వేరుగా ఫోటోలు షేర్ చేసుకున్నారు. కానీ రెండు ఫోటోల్లో బ్యాక్ గ్రౌండ్ ఒకేలా ఉండడంతో కొందరు అతిగా కామెంట్స్ పెట్టారు. అయితే షూటింగ్ జరుగుతున్న సమయంలో హీరోహీరోయిన్లు.. ఒకే హోటల్ లో స్టే చేయడం కామన్. హోటల్ కాబట్టి రూమ్స్ ఒకేలా ఉంటాయి. అందుకే రామ్, భాగ్యశ్రీ పిక్స్ లో బ్యాక్ గ్రౌండ్ ఒకేలా ఉంది. దానికే డేటింగ్ అంటూ రూమర్స్ స్ప్రెడ్ చేశారు. అదే సమయంలో మరో నెటిజన్ భాగ్యశ్రీ పిక్ కు.. మీ హ్యాండ్ కు ఉన్న రింగ్ ఎవరు తొడిగారని క్వశ్చన్ చేశాడు. దీంతో భాగ్యశ్రీ సరైన విధంగా రెస్పాండ్ అయింది. ఆ రింగ్ తానే కొనుకున్నానని తెలిపింది. దీంతో తాను ఎవరితో రిలేషన్ లో లేనని పరోక్షంగా క్లారిటీ ఇచ్చింది. అలా రామ్ తో డేటింగ్ చేస్తున్నట్లు వస్తున్న వార్తలకు చెక్ పెట్టింది అమ్మడు. ప్రస్తుతం మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి మూవీతో మంచి హిట్ అందుకున్న పి. మహేష్ బాబు దర్శకత్వంలో రామ్, భాగ్యశ్రీ సినిమా చేస్తున్నారు. అందులో రామ్ సాగర్ గా.. భాగ్యశ్రీ మహాలక్ష్మిగా సందడి చేయనున్నారు. ఇప్పటికే వారి ఫస్ట్ లుక్స్ ను మేకర్స్ రిలీజ్ చేయగా.. అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. మూవీపై పాజిటివ్ బజ్ కూడా క్రియేట్ అయింది. కొద్ది రోజుల క్రితం ఒక షూటింగ్ షెడ్యూల్ ను పూర్తి చేశారు మేకర్స్. స్పీడ్ గా మిగతా చిత్రీకరణను కంప్లీట్ చేయాలని చూస్తున్నట్లు సమాచారం. పీరియాడికల్ లవ్ స్టోరీగా మూవీని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మూవీ కోసం వెయిట్ చేస్తున్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్ CINEMA
- క్రైమ్ వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- విద్యా వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com